

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి   బుధవారం 08 డిసెంబరు 2021   సంపుటి : 03   సంచిక : 106   పేజీలు : 4   వెల : రూ 3-00


# సీఎం జగన్ అధ్యక్షతన స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సీఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం 217వ స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కోవిడ్ తదనంతర పరిస్థితుల్లో జరిగిన ఎస్ఎల్‌బీసీ సమావేశాల్లో ఇది ప్రత్యేకమైందన్నారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ సీఈఓతో పాటు, భారత రిజర్వ్ బ్యాంక్ అధికారులు కూడా ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. రాష్ట్ర అవసరాలు ఏమిటి? రాష్ట్రానికి సంబంధించి ఏమేం చేస్తే బాగుంటుందన్న అంశాలపై మీరు అందరూ చొరవ చూపి చర్చించడంతో పాటు, కొన్నింటిపై మాకు తగిన సూచనలు కూడా ఇస్తున్నారని సీఎం జగన్ అన్నారు.?ఇప్పుడు చాలా కీలక పరిస్థితుల్లో ఈ సమావేశం జరుగుతోంది. కోవిడ్ వ్యాప్తి తర్వాత దేశవ్యాప్తంగా ఇప్పుడిప్పుడే ఆర్థిక పరిస్థితి గాడిలో పడుతోంది. ఆర్థిక కార్యకలాపాలు కొంచెం పుంజుకుంటున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికానికి సంబంధించి స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 8.4 శాతంగా నమోదైంది.అదే సమయంలో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి ఆరునెలల సమయంలో చూస్తే అది 13.7 శాతంగా నమోదైంది. కరోనా థర్డ్‌వేవ్, ఒమిక్రాన్ వేరియెంట్‌పై జరుగుతున్న ప్రచారం వల్ల ఆర్థికస్థితి కాస్త మందగించింది. లేకపోతే ఆర్థిక పరిస్థితి చాలా వేగంగా పుంజుకునేది. ఏదేమైనప్పటికీ కరోనా థర్డ్‌వేవ్ దేశ ఆర్థిక రంగంపై చాలా తక్కువ ప్రభావం చూపాలని మేము ఆశిస్తున్నాం.ప్రస్తుత పరిస్థితుల్లో రుణ పరిమితి పెంపునకు సంబంధించి గట్టిగా కోరలేము. జాతీయస్థాయిలో ఈ ఏడాది నవంబరు 5వ తేదీ నాటికి జాతీయ బ్యాంకుల రుణాలు రూ.1.12 కోట్ల లక్షల కోట్లకు చేరుకోగా, అవి ఏటా 7.1 శాతం వృద్ధిని సూచిస్తున్నాయి. కాగా, సుస్థిర ఆర్థిక పురోగతిని సాధించేలా, కొనసాగించేలా బ్యాంకులు తగిన వ్యూహరచనతో ముందుకు పోవాల్సి ఉంది.కోవిడ్ వల్ల ఉత్పన్నమైన పరిస్థితులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఒకవైపు ప్రభుత్వ ఆదాయం పూర్తిగా పడిపోవడం, మరోవైపు ప్రజల కనీస అవసరాలు తీర్చడం కోసం అధికంగా ఖర్చు చేయాల్సి రావడం వల్ల, ప్రభుత్వంపై భారం మరింత పెరిగింది.కోవిడ్ వల్ల ప్రభుత్వ ఆదాయం 2019?20లో రూ.8 వేల కోట్లు, 2020?21లో రూ.14 వేల కోట్లు తగ్గడం, మరోవైపు కోవిడ్ నివారణ, నియంత్రణ కోసం అదనంగా రూ.8 వేల కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఆ విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై దాదాపు రూ.30 వేల కోట్ల భారం పడింది.అలాంటి పరిస్థితుల్లో బ్యాంకింగ్ రంగం సహకారంతోనే రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని గట్టెక్కించగలిగింది. కోవిడ్ సమయంలో కూడా పథకాలను అమలు చేసి సామాన్య ప్రజలను, నిరుపేదలను ఆదుకోగలిగింది. ఒకవేళ ఆ సహకారమే లేకపోతే ఆర్థిక వనరులు సమకూర్చుకోవడం చాలా కష్టమయ్యేది. కోవిడ్ సమయంలో నిరుపేదలను ఆదుకోవడంలో సహకరించినందుకు బ్యాంకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. బ్యాంకుల సహకారం వల్లనే గ్రామీణ ఆర్థిక పరిస్థితి కూడా గాడిలో పడింది.బ్యాంకులు తమ మొత్తం నికర రుణంలో ప్రాధాన్యతా రంగాలకు నిర్దేశించిన దానికి మించి 59.5 శాతం రుణాలు ఇవ్వడం, మరోవైపు రుణాలు?డిపాజిట్ల నిష్పత్తి 136 శాతం ఉండేలా బ్యాంకులు చూపిన చొరవ.. అదే విధంగా కోవిడ్ కష్టకాలంలో రాష్ట్రాన్ని ఆదుకున్నందుకు బ్యాంకింగ్ రంగాన్ని అభినందిస్తున్నాను. ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరు నెలల కాలంలోనే బ్యాంకులు చెప్పుకోదగిన స్థాయిలో రుణాలు మంజూరు చేశాయి. బ్యాంకుల వార్షిక రుణ ప్రణాళిక రూ.2,83,380 కోట్లు కాగా, అందులో మొదటి ఆరు నెలల్లోనే 60.53 శాతం, అంటే ఏకంగా రూ.1,71,520 కోట్ల రుణాలు బ్యాంకులు పంపిణీ చేశాయి. అదే విధంగా ప్రాధాన్యతా రంగాలకు వార్షిక రుణ లక్ష్యం రూ.2,13,560 కోట్లు కాగా, అందులో ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లోనే 47.29 శాతం, అంటే రూ.1,00,990 కోట్లను బ్యాంకులు ప్రాధాన్యతా రంగ రుణాలుగా పంపిణీ చేశాయి. ఈ సందర్భంగా కొన్ని విషయాలు మీ దృష్టికి తీసుకొస్తున్నాను. వ్యవసాయానికి సంబంధించి స్వల్పకాలిక పంట రుణాలలో బ్యాంకులు వార్షిక రుణ ప్రణాళికలో తొలి ఆరు నెలల్లోనే 51.57 శాతం రుణాలు పంపిణీ చేశాయి.

ఇది ప్రోత్సాహకరమైన రీతిలో ఉంది. కాగా, వ్యవసాయ దీర్ఘకాలిక (టర్మ్)) రుణాల్లో వ్యవసాయ మౌలిక వసతులకు సంబ్యోధించి వార్షిక రుణ ప్రణాళికలో ఈ ఆరు నెలల్లో 35.33 శాతం, వ్యవసాయ అనుబంధ రంగాల రుణ ప్రణాళికలో 37.31 శాతం మాత్రమే రుణాల్వివడం నిరాశజనకంగా ఉంది. ఈ రెండింటిలో రుణాల మంజూరు పెంచడంపై బ్యాంకులు దృష్టి పెట్టాల్సి ఉంది.ఇంకా వ్యవసాయ యాంత్రీకరణలో 9.08 శాతం, పాడి రంగానికి 24.29 శాతం, మొక్కలు నాటడం, చెట్టు పెంచడానికి 4.52 శాతం, ఇక ఉద్యాన పంటల సాగు, చేపల పెంపకానికి 14.84 శాతం రుణాలు మాత్రమే వార్షిక రుణ ప్రణాళికలో, తొలి ఆరు నెలల కాలంలో పంపిణీ చేయడం జరిగింది. అంటే ఆయా రంగాలకు నిర్దేశించుకున్న వార్షిక రుణ మొత్తంలో తొలి ఆరు నెలల్లో కేవలం 47.50 శాతం మాత్రమే పంపిణీ చేయడం జరిగింది.అదే విధంగా బ్యాంకులు నిర్దేశించుకున్న నికర రుణ మొత్తంలో వ్యవసాయ రంగానికి ఇచ్చిన రుణాలు గత ఏడాది (42.50 శాతం) కంటే ఈ ఏడాది (38.48 శాతం) తగ్గాయి. కాబట్టి రెండో దశ కోవిడ్ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని కీలక సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారం దిశగా బ్యాంకులు దృష్టి పెట్టాల్సి ఉంది. అదే విధంగా ఇంకా ఎందరో అర్హులైన రైతులకు ఇంకా 'కిస్సాన్ క్రెడిట్ కార్డు' (కేసీసీ)లు అందాల్సి ఉంది. అందువల్ల గ్రామాల్లో రైతులకు అడుగుడుగునా అండగా ఉంటున్న ఆర్బీకేల స్థాయిలో బ్యాంకులు వెంటనే ఆ కార్డుల జారీ చేపట్టి, అర్హులైన ప్రతి రైతుకు కేసీసీ అందేలా చూడాలి.

# మీ తీరు మారకపోతే.. మార్చాల్సి ఉంటుంది: మోదీ



**బీజేపీ ఎంపీలు, మినిస్టర్లు సమావేశాలు, మీటింగ్‌లకు తప్పకుండా హాజరు కావాలని ఆదేశం**

**తీరు మార్చుకోకపోతే.. మార్చాల్సి ఉంటుందని హుకుం**

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఎన్‌డీఏకి చెమటలు పట్టిస్తున్నాయి. పలు అంశాలపై విపక్షాలు అధికార పార్టీని టార్గెట్ చేసి.. గుక్క తిప్పుకోనివ్వడం లేదు. ఇలాంటి సందర్భంలో పలువురు బీజేపీ ఎంపీలు, మినిస్టర్లు.. సమావేశాలకు హాజరు కాకపోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. చాలామంది బీజేపీ ఎంపీలు మీటింగ్‌లకు, పార్లమెంట్ సమావేశాలకు హాజరు కావడం లేదని.. ఇది ఇలానే కొనసాగితే కఠిన చర్యలు తప్పవని మోదీ హెచ్చరించినట్లు సమాచారం.ఎంపీలు, మినిస్టర్లు ప్రవర్తన మార్చుకోకపోతే.. మార్చాల్సిన పరిస్థితులు తలెత్తుతాయని మోదీ తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది. బీజేపీ ఎంపీలు, మినిస్టర్‌లు క్రమశిక్షణతో మెలగాలని పదే పదే సూచించే మోదీ.. ఈ సారి సీరియస్ వార్నింగ్ ఇచ్చారట. క్రమశిక్షణతో మెలగాలని.. సమయపాలన పాటించాలని.. చిన్న పిల్లల మాదిరి కుంటి సాకులు చెప్పవద్దని సూచించారట. ఈ క్రమంలో మంగళవారం ఢిల్లీలో నిర్వహించని బీజేపీ పార్లమెంటరీ సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. "పార్లమెంట్ సమావేశాలకు, మీటింగ్‌లకు అందరూ క్రమం తప్పకుండా హాజరుకావాల్సిందే. పిల్లలకు చెప్పినట్లు.. పదే పదే దీని గురించి మీతో చర్చించడం నాకు బాగా అనిపించడం లేదు. మీరు మారకపోతే.. మార్పులు చేయాల్సి వస్తుంది" అని మోదీ హెచ్చరించారు. ఈ సమావేశానికి సీనియర్ మంత్రులు అమిత్ షా, పీయుష్ గోయల్, విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్, పార్లమెంటు వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తదితరులు హాజరయ్యారు. పార్లమెంటు సమావేశాల్లో విపక్షాలు పలు అంశాలపై మోదీ ప్రభుత్వం మీద ధ్వజమెత్తుతున్న సంగతి తెలిసిందే. తాజాగా నాగాలాండ్‌లో పౌరులపై సైనిక కాల్పుల పట్ల పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం అవుతోంది. ఇలాంటి సమయంలో మద్దతుగా.. ఏకతాటిపై నడవాల్సిన ఎంపీలు సమావేశాలకు డుమ్మా కొట్టడంపై మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఈ ఏడాది భవానీల కోసం గిరి ప్రదక్షణ ఏర్పాటు చేస్తున్నాం : వెల్లంపల్లి

విజయవాడ : భవాని దీక్షా విమరణల కో ఆర్డినేషన్ సమావేశం మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నేడు జరిగింది. ఈ సందర్భంగా వెల్లంపల్లి మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 29 వరకూ భవానీ దీక్షా విరమణలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులెవరూ ఇబ్బంది పడకుండా ఉండేందుకు అన్ని శాఖల అధికారులను సమన్వయం పరుస్తున్నామన్నారు. ఐదు రోజుల్లో లక్షల సంఖ్యలో భవానీలు అమ్మవారి దర్శనానికి వస్తుంటారని వెల్లంపల్లి తెలిపారు. ఈ ఏడాది భవానీల కోసం గిరి ప్రదక్షణ



ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేవాదాయ శాఖ నుంచి నిధుల పరంగా ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కొవిడ్ నిబంధనల నడుమ అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని మంత్రి వెల్లంపల్లి తెలిపారు.

## సొంత పార్టీ నేతలు, ఎంపీలపై ఎంపీ లావు కృష్ణదేవరాయ ఆగ్రహం

అమరావతి: వైసీపీలో లుకలుకలు నెలకొన్నాయి. సొంత పార్టీ నేతలు, ఎంపీలపై ఎంపీ లావు కృష్ణదేవరాయ ఆగ్రహం వ్యక్తం చేశారు. నరసరావుపేటలో మంత్రుల పర్యటనకు తనకు ఆహ్వానం లేకపోవడంపై అధిష్టానానికి ఎంపీ లావు కృష్ణదేవరాయ ఫిర్యాదు చేశారు. చిలకలూరిపేట మార్కెట్ యార్డు పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవానికి మంత్రులు బాలినేని, రంగనాథరాజు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీ కృష్ణదేవరాయను సొంతపార్టీ నేతలు, మంత్రులు పట్టించుకోని పరిస్థితి. దీనిపై ఎంపీ కృష్ణదేవరాయ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు.

# జీఎస్టీ పరిహారం కింద ఏపీకి 543 కోట్లు విడుదల: కేంద్ర మంత్రి



**రాజ్యసభలో శ్రీ వి.విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబు**

న్యూఢిల్లీ: జీఎస్టీ నష్టపరిహారం కింద గత నవంబర్ 3న రాష్ట్రాలకు 17 వేల కోట్లు విడుదల చేయగా అందులో ఆంధ్రప్రదేశ్ వాటా కింద 543 కోట్ల రూపాయలు ఇచ్చినట్లు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి వెల్లడించారు. రాజ్యసభలో మంగళవారం వైఎస్సార్సీపీ సభ్యులు వి. విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిచ్చారు. ఏప్రిల్ 20 నుంచి మార్చి 21 మధ్య కాలంలో జీఎస్టీ పరిహారం కింద రాష్ట్రలకు విడుదల చేసిన 1,13,464 కోట్ల రూపాయలకు ఇది అదనం అని తెలిపారు. 2017లో జీఎస్టీ చట్టం అమలులోనికి వచ్చినప్పటి నుంచి 2017-18, 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఆయా రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారం కింద చెల్లించాల్సిన మొత్తాలను పూర్తిగా విడుదల చేయడం జరిగిందని చెప్పారు. కరోనా మహమ్మారి విజృంభించిన నేపథ్యంలో జీఎస్టీ వసూళ్ళు గణనీయంగా తగ్గాయని మంత్రి అన్నారు. అయితే రాష్ట్రాలకు చెల్లించాల్సిన జీఎస్టీ పరిహారం వాటా పెరిగింది. కానీ ఆ మేరకు చెల్లింపులు చేయడానికి జీఎస్టీ కాంపెన్సేషన్ ఫండ్‌లో చాలినంత నిధులు లేవని అన్నారు.జీఎస్టీ వసూళ్ళలో ఏర్పడిన భారీ లోటు, రాష్ట్రాలకు చెల్లించాల్సిన బకాయిలపై జీఎస్టీ కౌన్సిల్‌లో పలుమార్లు జరిపిన చర్చల అనంతరం 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలలో రాష్ట్రాలకు 1 లక్షా 10 వేల కోట్లు, 1 లక్షా 59 వేల కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. జీఎస్టీ రెవెన్యూలో తరుగుదలను పూడ్చేందుకు కేంద్రం క్రమం తప్పకుండా జీఎస్టీ పరిహారాన్ని రాష్ట్రాలకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.జీఎస్టీ కంపెన్సేషన్ ఫండ్ నుంచే కాకుండా రుణాల రూపంలో రాష్ట్రాలకు నిధులు విడుదల చేసినప్పటికి కూడా 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలగాను జీఎస్టీ కాంపెన్సేషన్ కింద కేంద్రం చెల్లించాల్సిన బకాయిలు ఇంకా 51 వేల 798 కోట్ల రూపాయలు ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. జీఎస్టీ అమలులోనికి వచ్చినప్పటి నుంచి అయిదేళ్ళపాటు రాష్ట్ర పన్నుల రాబడిలో ఏర్పడే లోటును ఏటా 14 శాతం వరకు జీఎస్టీ నష్టపరిహారం కింద చెల్లించేలా జీఎస్టీ చట్టంలో పొందుపరచినట్లు ఆయన తెలిపారు.

# సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి సీఎం జగన్ విరాళం

అమరావతి: సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విరాళం ఇచ్చారు. ఏపీ సైనిక్ వెల్‌ఫేర్ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి, విఎస్ఎమ్ (రిటైర్డ్), సైనిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి సీఎం జగన్‌కి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, సైనిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.వెంకట రాజారావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ భక్తవత్సల రెడ్డి, సూపరింటెండెంట్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# 'రాష్ట్రంలో కొత్త నగరం రావాలంటే అది రాయలసీమకే రావాలి'

తిరుపతి: మూడు రాజధానుల బిల్లును ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంతో రాయలసీమపై దుష్ప్రచారం జరుగుతోందని రాయలసీమ మేధావుల ఫోరం కన్వీనర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం ఎస్వీయూలో రాయలసీమ మేధావుల ఫోరం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'అమరావతి రైతు నాయకులు రాయలసీమ వాసులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. రాయలసీమ వాసులు వారి ప్రాంతానికి రాజధాని వద్దని చెబుతున్నారని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్త నగరం రావాలంటే అది రాయలసీమకే రావాలి.రాయలసీమలో గ్రామీణ వాతావరణం కలిగిన పట్టణాలే తప్ప ఒక్క నగరం కూడా లేదని గతంలో శ్రీకృష్ణ కమిటీ చెప్పింది. అమరావతి రైతులు విశాల హృదయం, విశాల త్యాగం చేసినవారు. అమరావతి రైతు నాయకులు రాయలసీమవాసులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. బీజేపీ, వామపక్షాలు కర్నూలుకు హైకోర్టు రావాలని ఒప్పుకున్నాయి. రాయలసీమ వాసుల మౌనాన్ని అలుసుగా తీసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.రాయలసీమకు హైకోర్టు రాకూడదని ఎస్వీయూలో బహిరంగ సభ పెట్టాలంటే మేం ఎందుకు అనుమతించాలి. రాయలసీమ ప్రజలందరూ ఈ విషయంపై స్పందించాలి.

# సంపాదకీయం

బుధవారం 08 డిసెంబరు 2021

## అణ్వాయుధాలు సరే... ఆదాయం ఎక్కడ...

ఈ ఏడాది చివరి నాటికి పాకిస్తాన్ దివాలా తీసిన అణ్వాయుధ శక్తిగా మారుతుంది. ఇబ్బడి ముబ్బడిగా చేసిన అప్పుల వల్లే దానికి ఈ దుస్థితి దాపురించింది. పాకిస్తాన్ విదేశీ రుణ భారం దాని జీడీపీ కంటే ఎక్కువ. విదేశీ రుణాలు పెరగడం జాతీయ భద్రతా సమస్యలను సృష్టిస్తుందని ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అంగీకరించారు. అణ్వాయుధ శక్తి కలిగిన పాకిస్థాన్ ఆర్థికంగా దివాలా తీయడం ప్రాంతీయంగా, అంతర్జాతీయంగా అనేక భద్రతా పరమైన చిక్కులను సృష్టిస్తుంది.ప్రస్తుతం పాకిస్తాన్ విదేశాలకు 127 బిలియన్ డాలర్ల (రూ. 9,51,642 కోట్లు) అప్పు ఉంది. ఇప్పటి వరకు దానికి ఇదే అత్యధిక విదేశీ రుణం. అవకాశం ఉన్న ప్రతి చోట అప్పు చేసింది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ప్రపంచ ద్రవ్యనిధి-ఐఎంఎఫ్, పారిస్ క్లబ్ నుంచే గాక స్థానిక వాణిజ్య బ్యాంకుల నుంచి కూడా భారీగా రుణాలు తీసుకుంది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రుణాలు తీసుకునే వేగం పెరిగింది. ఐతే, అప్పులు పెరిగిపోవడానికి గత ప్రభుత్వాలే కారణమని ఇమ్రాన్ ఖాన్ సర్కార్ ఆరోపిస్తోంది. గత ప్రభుత్వాలు తీసుకున్న అప్పులను వడ్డీతో తిరిగి కట్టాల్సిన రావటం వల్ల మళ్లీ రుణాలు తీసుకోవాల్సి వచ్చిందనేది ప్రభుత్వ వాదన. ఐతే, సర్కార్ ప్రభుత్వ అనుసరిస్తున్న బలహీన విధానాలే ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి కారణం అన్నది నిపుణుల మాటగత పదమూడేళ్లలో పాకిస్తాన్ లో మూడు పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అవి పీపుల్స్ పార్టీ -పీపీపీ, పాకిస్తాన్ ముస్లిం లీగ్ (నవాజ్), పాకిస్తాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ -పీటీఐ. పీపీపీ పాలన మొదలైనపుడు విదేశీ రుణం సుమారు రూ. 3,37,198 కోట్లు. 2013లో పీపీపీ పాలన ముగిసే నాటికి రూ.4,57,099 కోట్లుకు చేరింది. ముస్లింలీగ్ హయాం ముగిసేప్పటికి విదేశీ రుణ భారం రూ.7,11,944 కోట్లు. ప్రస్తుత పీటీఐ పాలనలో రూ.9,51,642 కోట్లకు చేరింది. ఈ లెక్కల ప్రకారం పీపీపీ పాలనలో విదేశీ రుణం 16 బిలియన్ డాలర్లు పెరిగితే, నవాజ్ లీగ్ అధికారంలో ఉన్న ఐదేళ్లలో 34 బిలియన్ డాలర్లు పెరిగింది. వీటితో పోల్చి చూస్తే పీటీఐ హయాంలో కేవలం 39 నెలల్లోనే విదేశీ రుణం 32 బిలియన్ డాలర్లు పెరిగిందివిదేశీ రుణాలు పెరగడానికి ప్రధాన కారణం ఐఎంఎఫ్ నిబంధనలు. ఇప్పుడు వడ్డీ రేటు 6.50 నుంచి 13.25కి, మారకం రేటును 121 నుంచి 166కు పెరిగింది. ఈ రెండు కారణాల వల్ల రుణాలు విపరీతంగా పెరిగాయి. మరోవైపు, పాకిస్తాన్ దిగుమతులు పెరిగాయి. ఇది విదేశీ మారక నిల్వల క్షీణతకు దారితీసింది. గత ఐదు వారాలుగా విదేశీ మారక నిల్వలు అదే పనిగా క్షీణిస్తున్నాయి. పాకిస్తాన్ రూపాయి ఆసియాలోనే అత్యంత బలహీన కరెన్సీగా మారింది.ఆహారం, ఆహార ఉత్పత్తులు, ఆయిల్ ఉత్పత్తులు, మెషినరీ, వాహనాల అధిక వినియోగంతో దిగుమతులు పెరిగాయి. దిగుమతులు పెరిగిన స్థాయిలో ఎగుమతులు పెరగలేదు. అది వాణిజ్య లోటుకు దారితీసింది. ఫలితంగా కరెంట్ అకౌంట్ లోటు పెరిగి విదేశీ మారక విలువ పడిపోయింది. అందుకే దేశం ఒక సంక్షోభంలో చిక్కుకుందిరానున్న మూడు, నాలుగేళ్లలో 14 బిలియన్ డాలర్ల విదేశీ అప్పులను పాకిస్తాన్ తిరిగి చెల్లించాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితిలో సౌదీ అరేబియా మరోసారి పాకిస్తాన్‌కు సాయం చేయడానికి ముందుకొచ్చింది. పాకిస్తాన్‌కు 4.2 బిలియన్ డాలర్ల సాయం ప్రకటించింది. సౌదీ అరేబియా, యూఏఈలు గతంలో చాలాసార్లు పాకిస్తాన్‌ను ఇలాగే ఆదుకున్నాయి. ఇవికాకుండా, 1980ల నుంచి ఇప్పటి వరకు 13వ సార్లు ఐఎమ్ఎఫ్ నుంచి లోన్ తీసుకుంది.ఇక, ఈ దివాలా లెక్కలను పక్కన పెట్టి, అసలు దానికి ఆ పరిస్థితి ఎందుకు వచ్చిందనే దానిపై దృష్టి పెట్టాలి. తక్కువ ఆదాయపు పన్ను రాబడులు, విపరీతమైన రాజకీయ అవినీతి, ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ ద్రవ్య సంస్థల డిమాండ్‌కు అనుగుణంగా కఠినమైన ఆర్థిక సంస్కరణలను విధించడానికి ఇష్టపడకపోవడం వంటి వాటితో పాటు దేశం ఆర్థిక దివాలా తీయడానికి ఇంకా ప్రధాన కారణాలు ఏమిటన్నది చూడాలి.మొదటి నుంచి పాకిస్తాన్ తనను తాను ఎక్కువగా ఊహించుకోవటమే ఈ ఆర్థిక దుస్థితికి దారితీసింది. దశాబ్దాలుగా అమెరికా తన వ్యూహాత్మక ప్రయోజనాల కోసం పాకిస్తాన్ వాడుకుని దానిని ఒక అద్దె దేశంగా మార్చింది. అయితే, అమెరికాకు ఇప్పుడు పాకిస్తాన్‌తో అవసరాలు తగ్గాయి. దాంతో పాటే ప్రేమ కూడా తగ్గింది. ఒసామా బిన్ లాడెన్ హత్య తరువాత పాకిస్తాన్‌పై అమెరికా నమ్మకం కోల్పోయింది. దానికి ఏటేటా అందించే నిధులలో గణనీయంగా కోత పెట్టింది.అమెరికా సాయం దూరమవటంతో కొన్నేళ్లుగా అప్పు కోసం పాకిస్తాన్ పక్క చూపులు చూస్తోంది. అయితే ఇప్పుడు అమెరికా స్థానంలో మరింత ప్రమాదకరమైన చైనా ప్రవేశించింది.రెండు మూడేళ్లుగా ఆ దేశంతో వ్యూహాత్మకం వాణిజ్యం నెరుపుతోంది. చైనా-పాకిస్తాన్ ఎకనమిక్ కారిడార్ వంటి ప్రాజెక్టులకు తెరమీదకు తెచ్చింది. దాంతో అది చైనా ఆర్థిక ఉచ్చులో చిక్కుకుంది.పాకిస్తాన్ దివాలాకు అమెరికా, చైనాతో పాటు సౌదీ అరేబియా కూడా పెద్ద కారణమే. సౌదీ ఆర్థిక సాయం వెనుక ఉన్నది తోటి ఇస్లామిక్ దేశం అనే ఔదార్యం మాత్రమే కాదు. అణ్వాయుధ సాంకేతికత, బ్లూప్రింట్లకు బదులుగా పాకిస్తాన్‌కు భారీగా ఆర్థిక సహాయం అందించింది. నిజానికి పాకిస్తాన్‌ని ఆర్థికంగా ఆదుకోవటానికి ఇరాన్‌తో దానికి ఉన్న శతృత్వం కూడా కారణమే.ఇక, పాకిస్తాన్ దివాలాకు రెండు ప్రధాన కారణాలు కనిపిస్తాయి. విపరీతమైన రక్షణ ఖర్చులు. ముఖ్యంగా అణ్వాయుధాలు, బాలిస్టిక్ క్షిపణులపై ఎక్కువగా ఖర్చు చేసింది. రక్షణ పరంగా భారత్‌తో వ్యూహాత్మక సమానత్వం కోసం భారీగా అప్పులు చేసింది. పాకిస్తాన్ ఆర్థికంగా చితికి పోవటానికి ఇది మొదటి ప్రధాన కారణంమరోవైపు, ఆర్థికంగా బలహీనమైన పాకిస్తాన్‌తో "చైనా పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (అఖఇఅ)" ప్రాజెక్టు ప్రారంభించింది చైనా. అందుకు ఎంత కావాలంటే అంత ఇచ్చింది. ఫలితంగా ఈ పేద అణ్వాయుధ దేశం చైనా ఆర్థిక మత్తుకు అలవాటు పడిపోయింది. చైనా ఆకర్షణలకు లోనై తన జాతీయ, ఆర్థిక భద్రతతో వ్యాపారం చేసింది. "అప్పు ఉచ్చు" బిగించి పాక్ పై వ్యూహాత్మక పట్టు సాధిస్తోంది.ఇక, గత వారం ప్రధాని ఇమ్రాన్ ఖాన్ చెప్పిన చెప్పినట్టు ఈ దివాలా ప్రధాన జాతీయ భద్రతా సమస్యగా మారింది. కాని ఆయన వివరణాత్మక కారణాలు చెప్పలేదు. అధిక ద్రవ్యోల్బణం, పడిపోతున్న రూపాయి విలువ కారణంగా కారణంగా తలెత్తే ఆర్థిక అశాంతి గురించి ఆయన ప్రస్తావించారా? లేదంటే సైనిక అవసరాలకు తగిన ఆర్థిక వనరుల గురించి మాట్లాడరా ..అనేది తెలియదు.ఐతే, పాకిస్తాన్ జాతీయ భద్రతపై ప్రభావం చూపుతున్నందున రెండింటిని పరిగణనలోకి తీసుకుని విశ్లేషించాలి. దేశంలోని రాజకీయ అసంతృప్తి తీవ్రమై అది సుపరి పాలనతో పాటు నియంత్రణపై ప్రభావం చూపుతుంది.

# పోలవరం... ఎప్పటికి పూర్తయ్యేనూ... ?



ఏలూరు, డిసెంబర్ 7, (న్యూస్ పల్స్) పోలవరం 2022 ఏప్రిల్ నాటికి పూర్తి కావడం కష్టమేనని.. ఎన్నో కారణాల వల్ల పనుల్లో ఆలస్యమవుతోందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ప్రాజెక్ట్‌లో నీటి పారుదల పనులకు మాత్రమే నిధులు ఇస్తామని కేంద్రం స్పష్టం చేసింది. రాజ్యసభలో ఏపీ ఎంపీలు అడిగిన ప్రశ్నలకు కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. 2022 నాటికి పోలవరం పూర్తి కావడం కష్టమేనంటూ అభిప్రాయం వ్యక్తంచేశారు. ప్రతినెలా పనులను రివ్యూ చేస్తున్నా కరోనా వల్ల పనుల్లో కొంత ఆలస్యం జరిగిందని కేంద్రం పేర్కొంది. సహాయ, పునరావాస కార్యకలాపాల్లో ఆలస్యం కూడా కారణమని స్పష్టం చేసింది. టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు రాజ్యసభలో రిటన్‌గా ఆన్సర్ ఇచ్చారు జలశక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్. పోలవరంలో స్పిల్‌వే, అప్‌స్ట్రీమ్ కాఫర్ డ్యామ్, కాంక్రీట్ డ్యామ్ -గ్యాప్ 3, డయాఫ్రమ్ వాల్ ఆఫ్ ఎర్త్ కమ్ రాక్?ఫిల్ డ్యామ్ వంటి కీలక భాగాల నిర్మాణం ఇప్పటికే పూర్తయినట్లు ఏపీ ప్రభుత్వం నివేదిక ఇచ్చిందని పేర్కొన్నారు. స్పిల్‌వే రేడియల్ గేట్లు 88%, స్పిల్ ఛానెల్ 88%, అప్రోచ్ ఛానల్ ఎర్త్‌వర్క్ 73%, పైలట్ ఛానెల్ పని 34%, పవర్ హౌస్ పునాది తవ్వకం 97% పూర్తయినట్లు కేంద్రమంత్రి ప్రకటించారు.ప్రాజెక్ట్‌ని పూర్తి చేయడానికి వచ్చే ఏడాది ఏప్రిల్ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, పనుల ప్రస్తుత స్థితి షెడ్యూల్‌కు అనుగుణంగా ఉన్నట్లు కనిపించట్లేదని స్పష్టం చేశారు. కరోనా, ఎర్త్ కమ్ రాక్?ఫిల్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్ గ్యాప్?1, గ్యాప్?2 పనులు, పునరావాస కార్యకలాపాలు పూర్తి చేయడంలో ఆలస్యం వంటి కారణాల వల్ల ఈ పరిస్థితి నెలకొందన్నారు. మరోవైపు ప్రాజెక్ట్‌లో నీటి పారుదల పనులకు మాత్రమే నిధులు ఇస్తామని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రాజెక్ట్ రెండవసారి సవరించిన అంచనా వ్యయం 55,548 కోట్లని, 2019 ఫిబ్రవరిలో సలహా సంఘం సమావేశంలో దీన్ని ఆమోదించినట్లు పేర్కొన్నారు. అయితే సవరించిన అంచనా వ్యయంలో కేవలం ఇరిగేషన్ విభాగానికి అయ్యే 35,950 కోట్లకు మాత్రమే రివైజ్డ్ కాస్ట్ కమిటీ ఆమోదం తెలుపుతూ మార్చి 2020న నివేదిక ఇచ్చిందని వివరించారు. దీనిపై పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ) తుది సిఫార్సుల అనంతరం ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ తీసుకుంటామని తన సమాధానంలో పేర్కొన్నారు.ఈ ఏడాది నవంబర్‌లో అప్‌డేట్ చేసిన ప్రాజెక్ట్ షెడ్యూల్‌ను సూచించేందుకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ ద్వారా ఒక కమిటీని ఏర్పాటు చేశారని టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రతీ నెల నెలవారీగా ప్రాజెక్టు పనుల పురోగతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్ అథారిటీకి నివేదిస్తోందని, 2019 జనవరి నుంచి ఈ ఏడాది నవంబర్ వరకు జరిగిన పనుల పురోగతిని కేంద్ర మంత్రి వివరించారు. హెడ్ వర్క్స్‌లో భాగంగా 245.62 లక్షల క్యూబిక్ మీటర్ భూమి పని, కట్ట పని, 12.83 లక్షల క్యూబిక్ మీటర్ కాంక్రీటు పని జరిగిందన్నారు. అంతేగాక కుడి ప్రధాన కాలువకు సంబంధించి 3.86 లక్షల క్యూబిక్ మీటర్ భూమి పని, 1.37 లక్షల క్యూబిక్ మీటర్ లైనింగ్, 0.42 లక్షల క్యూబిక్ మీటర్ నిర్మాణాలు జరిగాయని తెలిపారు. కాగా ఎడమ ప్రధాన కాలువ విషయంలో 13.90 లక్షల క్యూబిక్ మీటర్ భూమి పని, 0.48 లక్షల క్యూబిక్ మీటర్ లైనింగ్, 1.97లక్షల క్యూబిక్ మీటర్ నిర్మాణాలు జరిగాయని పేర్కొన్నారు. అదే సమయంలో ప్రాజెక్టు కోసం 995.77 హెక్టార్లు భూసేకరణ జరగగా, 2,429 ప్రాజెక్ట్ నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించినట్లు వివరించారు.

# అప్పుడే ప్రారంభమైన జిల్లాల పంచాయితీ

ఏలూరు, డిసెంబర్ 7, (న్యూస్ పల్స్)వైసీపీ నేతల మధ్య ఏదో ఒక వివాదం నిత్యం తెరమీదికి వస్తూనే ఉంది. ఒకటి వదిలితే.. ఒకటి పంచాయితీ గా మారి.. పార్టీ అధినేత, సీఎం జగన్‌కు తలనొప్పులు తెస్తూనే ఉంది. తాజాగా పశ్చిమ గోదావరిలో మరో విషయం వెలుగు చూసింది. త్వరలోనే కొత్త జిల్లాలను ఏర్పాటు చేసేందుకు జగన్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలోని ప్రతిపార్లమెంటు నియోజకవర్గాన్నీ ఒక జిల్లాగా మార్చేందుకు ఆయన ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రతిపాదనతో పాటు మరికొన్ని కొత్త జిల్లాలను కూడా ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు వస్తున్నాయి. ఇక పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జిల్లాల విభజనను పార్టీలోనే కొందరు సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు కూడా వ్యతిరేకిస్తోన్న పరిస్థితి ఉంది.ధర్మాన ప్రసాదరావుతో మొదలు పెట్టి దక్షిణ కోస్తా, సీమ, రాజధాని జిల్లాల వైసీపీ నేతలు కూడా జిల్లాల విభజనపై తమ అభ్యంతరాలు తీవ్రంగా వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పశ్చిమ గోదావరిలో నరసాపురం, ఏలూరు పార్లమెంటు స్థానాలు కొత్త జిల్లాలుగా ఏర్పడనున్నాయి. ఏలూరు కొత్త జిల్లా విషయంలో ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలు లేవు. కానీ, కొత్తగా ఏర్పడే నరసాపురం జిల్లా విషయంలో వైసీపీ నేతల మధ్య విభేదాలు చోటు చేసుకున్నాయి. ఇక్కడ కూడా పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రంగా ఉన్న నరసాపురం జిల్లా ఏర్పాటు కావడం మంచిదేనని అంటున్నా.. జిల్లా కేంద్రంగా మాత్రం నరసాపురం ఉండాలని ఒక నేత, కాదు, భీమవరం ఉండాలని మరోనేత పట్టుబడుతున్నారు. దీంతో ఇది చిలికిచిలికి గాలివానగా మారుతోంది. నరసాపురం ఎమ్మెల్యే ప్రసాదరాజు.. తన వాణిని బలంగా వినిపిస్తున్నారు. నరసాపురం జిల్లా కేంద్రంగా ఉంచాలని ఆయన చెబుతున్నారు.దీనికి సంబంధించి ఆయన వాదన ఏంటంటే.. నరసాపురంలో ఇప్పటికే సబ్‌కలెక్టర్ ఆఫీస్‌తోపాటు కొత్తగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆఫీసులు నెలకొల్పడానికి అవసరమైన స్థలం అందుబాటులో ఉందని చెబుతున్నారట. సముద్రతీర ప్రాంతం కూడా కలిసి వస్తుందని వాదిస్తున్నారట. నరసాపురానికి బ్రిటీష్ వారి పాలన నుంచి ఘనమైన చరిత్ర ఉంది. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు వారధిగా ఉంటుంది. నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేస్తే స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులపై ఓ నివేదికను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. అదే సమయంలో భీమవరాన్ని జిల్లా కేంద్రంగా ఉంచాలని అంటున్న ఈ నియోజకవర్గం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తన వాదన కూడా బలంగానే వినిపిస్తున్నారు.నరసాపురం బదులుగా అన్ని వనరులకు కేంద్రంగా ఉన్న భీమవరను జిల్లా కేంద్రం చేయాలని శ్రీనివాస్ కోరుతున్నారు. అంతేకాదు, భీమవరాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే.. ఓటు బ్యాంకు పూర్తిగా వైసీపీకి అనుకూలంగా మారుతుందని, ఇది అన్ని నియోజకవర్గాలకు సమాన దూరంలో ఉంటుందని? మున్ముందు ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందులూ ఉండవని ఆయన వాదన. అయితే.. ఈ విషయంలో ఈ ఇద్దరి నేతల మధ్య తీవ్ర వివాదం ముదిరిపోతోంది. ఏకంగా ఈ సమస్యను సీఎం జగన్‌కు వివరించేందుకు ఇద్దరూ సమాయత్తమవుతున్నారు. ఇక, వైసీపీలోనే తటస్థ నేతలు మాత్రం వీరి మధ్య సయోధ్యకు ప్రయత్నాలు చేస్తున్నారు.

# బకాయిలపై న్యాయపరమైన చర్యలు...?

విజయవాడ, డిసెంబర్ 7, (న్యూస్ పల్స్)రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థల నురచి రావాల్సిన బకాయిలను వసూలు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థలైన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, గ్రామీణ విద్యుదీకరణ సంస్థలు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నాయి. ఎన్నిసార్లు గడువు ఇచ్చినా ఫలితం లేకవడంతో ఇక న్యాయపరమైన చర్యలకు దిగుతామని హెచ్చరించాయి. ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంకరప్టసీ చట్టాన్ని కూడా ప్రయోగిస్తామని తేల్చిచెప్పాయి. దీరతో రాష్ట్ర ఇంధన శాఖ అధికారులు బకాయిలకు చెల్లించాల్సిన నిధుల కోసం ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ఆర్థికశాఖపైనా ఒత్తిడి తీసుకురావాలని యోచిస్తున్నారు.రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం గత కొన్నేళ్లుగా జెన్‌కో, పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లు కేంద్ర సంస్థల నురచి రుణాలు తీసుకున్నాయి. అయితే సకాలంలో వాటి కిస్తీలు చెల్లించకపోవడంతో చాలా మొత్తం ఓవర్‌డ్యూస్‌గానే కొనసాగుతున్నాయి. చివరికి వాటిల్లో కొన్ని ఎన్‌పిఎ (నాన్ పర్ఫార్మింగ్ అసెట్స్)గా కూడా మారిపోయాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర అధికారులు కొద్ది రోజుల క్రితం ఆర్‌ఇసి, పిఎఫ్‌సి అధికారులతో చర్చించి వాయిదాల పద్ధతిలో బకాయిలు చెల్లించేందుకు అంగీకరించినట్లు తెలిసింది. అయినప్పటికీ నిర్దిష్ట సమయంలోగా వాయిదాలు చెల్లించకపోవడంతో మరోసారి రాష్ట్ర జెన్‌కో అధికారులకు లేఖలు రాసాయి. ఈ సందర్భంగా డిసెంబర్ 24 వరకు గడువు విధించాయి. ఈ లోగా చెల్లించకపోతే న్యాయపరమైన చర్యలకు దిగుతామని తేల్చిచెప్పాయి. ఇప్పటికే రూ.17,781 కోట్లు రుణాలుగా ఇచ్చినట్లు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ పేర్కొంది. ఇందులో బకాయిలు కోసం ఈ ఏడాది జూలై 21 నురచి ఆరు సార్లు డిమాండ్ నోటీసులు జారీ చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని అభియోగం. చివరకు ఇటీవల జరిగిన చర్చల ఫలితంగా నవంబర్ 29న రూ.354.62 కోట్లు, 30వ తేదీన రూ.328.45 కోట్లు తమకు చెల్లించినట్లు వివరించింది. డిసెంబర్ ఒకటి నాటికి ఇంకా తమకు రూ.1162.86 కోట్లు బకాయి రావాల్సి ఉందని పిఎఫ్‌సి పేర్కొంది. ఆర్‌ఇసి కూడా ఇదే హెచ్చరికలు చేసింది. తాము రూ.17,184 కోట్ల వరకు రుణాలు ఇచ్చామని, అవి ఓవర్‌డ్యూస్‌గానే కాకుండా ఎన్‌పిఎలోకి కూడా చేరుతున్నాయని తన లేఖలో పేర్కొంది. నవంబర్ 30న రూ.310.42 కోట్లు, 29న రూ.35 కోట్లు జమయ్యాయని, మిగిలిన రూ.141.97 కోట్లు ఇంకా రాలేదని పేర్కొంది. ఈ మొత్తం 24వ తేదీలోగా చెల్లించకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. గత నెలాఖరులో పిఎఫ్‌సి, ఆర్‌ఇసి అధికారులు రాష్ట్రానికి వచ్చి ఇక్కడి జెన్‌కో అధికారులతోపాటు నేరుగా సిఎస్, సిఎంలతో కూడా చర్చలు జరిపారు. అనంతరం బకాయిల కోసం రెండు సంస్థలూ ఒకేరోజు లేఖలు రాయడం, ఒకే అంశాలతో రాయడం, ఒకే తేదీని డెడ్‌లైన్‌గా ప్రకటించడం గమనార్హం. లేఖలోని వాక్యాలు కూడా ఒకేవిధంగా ఉన్నాయిఎన్‌పిఎలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉండడం, కేంద్ర సంస్థలు న్యాయ చర్యలకు సిద్ధమవుతుండడంతో పాత బకాయిల చెల్లింపులపై జెన్‌కో, పవర్ డెవలంమెంట్ సంస్థ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. తక్షణమే జెన్‌కోకు రూ.1294 కోట్లు, పవర్ డెవలప్‌మెంట్ సంస్థకు రూ.1366 కోట్లు కలిపి మొత్తం రూ.2660 కోట్లు కేటాయించాలని జెన్‌కో అధికారులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని ఆర్థికశాఖకు కూడా వివరించనున్నారని సమాచారం.

# సీఎం సరే... పార్టీ అధినేతగా... మాత్రం

విజయవాడ, డిసెంబర్ 7,(న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ సీఎంగా సక్సెస్ అయ్యాడేమో తెలియదు కాని పార్టీ అధినేతగా మాత్రం ఫెయిలయ్యాడనే చెప్పాలి. సీఎంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ కొంత విపక్షాలను ఇరకాటంలో నెడుతున్న జగన్ సొంత పార్టీని మాత్రం కంట్రోల్ లో పెట్టలేకపోతున్నారు. వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణరాజు విషయంలో జగన్ అట్టర్ ఫ్లాప్ అయ్యారన్నది అందరూ అంగీకరిస్తున్న సంగతి. రఘురామ కృష్ణరాజు సంగతి అందరికీ తెలిసిందే. తనను కవ్విస్తే మరింత రెచ్చిపోతాడు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నప్పుడు ఆయన మానాన ఆయనను వదిలేసి ఉంటే బాగుండేది. కానీ అరెస్ట్ చేసి ఇబ్బంది పెడుతుండటంతో రఘురామ కృష్ణరాజు మరింత రెచ్చిపోతున్నారు. పార్లమెంటులో ప్రభుత్వం, పార్టీ పరువును రోజూ గాలి తీసేస్తున్నారు. రఘురామ కృష్ణరాజును కదిలించుకోవడం తేనెటీగల తుట్టెను కదిలించుకోవడమే. ఉండవల్లి అరుణ్ కుమార్ లాంటి వాళ్లు సయితం రఘురామ కృష్ణరాజు విషయంలో జగన్ తప్పు చేశారని అభిప్రాయపడ్డారు. అలాంటి వారితో అప్పుడప్పుడు మాట్లాడుతుంటే వారి ఇగో తృప్తి పడుతుంది. అలాకాకుండా నెగ్లెక్ట్ చేస్తే వారు మరింత రెచ్చిపోతారు. ఇప్పుడు రఘురామ కృష్ణరాజు విషయంలో అదే జరుగుతుంది. తనను, తన ప్రభుత్వాన్ని రోజూ తిడుతున్నాడని తెలుసు. అయినా ఆయనను జగన్ ఏమీ చేయలేకపోతున్నారు.పోతే పోయింది ఒక్క సీటు అనుకుని రఘురామ కృష్ణరాజును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే దరిద్రం వదిలపోతుందన్న వ్యాఖ్యలు పార్టీ నుంచే విన్పిస్తున్నాయి. రోజూ ఈ టార్చర్ పడేకన్నా అదే బెటర్ అని అంటున్నారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ అనర్హత వేటు వేయాలని స్పీకర్ కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఇక ఉండదని కూడా తెలుసు. అంతకంటే ఆయనను పార్టీ నుంచి బహిష్కరిస్తే ఆయన వేరే పార్టీలో ఉండి చేసే విమర్శలకు విలువ ఉండదు. మరి జగన్ ఈ విషయంలో అట్టర్ ఫ్లాప్ అయినట్లే కదా?

# విశాఖలో అధికార పార్టీ నేతల దందాలు

విశాఖపట్టణం, డిసెంబర్ 7, (న్యూస్ పల్స్)వైసీపీని నమ్మి ఒక్క విశాఖ సిటీ తప్ప మొత్తానికి మొత్తం విశాఖ జిల్లా అంతటా గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టారు. జగన్ ప్రభంజనం నాడు కొనసాగుతోంది. ఎవరు ఎమ్మెల్యే అభ్యర్ధి అని కూడా చూడకుండా ఓటేయడమే కాకుండా భారీ మెజారిటీలు కూడా అందించారు. అయితే ఏడాదిన్నర కాలం తిరిగేసరికి ఇపుడు ఆ మోజు ఉందా, అక్కడ ఫ్యాన్ ఇంకా గిర్రున అదే స్పీడ్ తో తిరుగుతుందా అంటేనే డౌటే వస్తోంది. చాలా నియోజకవర్గాలలో వర్గ పోరు గుప్పుమంటోంది. ఎమ్మెల్యేలుగా నెగ్గిన వారు చేస్తున్న పెద్దన్న రాజకీయాలతో క్యాడర్ దూరమవుతోంది. లీడర్ల మధ్యన పోరు ఒక్క లెక్కన సాగుతోంది.విశాఖ సిటీలో భాగంగా ఉన్న గాజువాక నియోజకవర్గం గత ఎన్నికల్లో ఏపీ లెవెల్లో మారుమోగింది. దానికి కారణం సినీ స్టార్ పవన్ కళ్యాణ్ అక్కడ పోటీ చేయడం. జగన్ ఒకే ఒక్క మీటింగ్ పెట్టి రియల్ స్టార్ తమ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆయనకు ఓటు చేయాలని ఇచ్చిన పిలుపుతో జనం అటే మొగ్గు చూపారు. పవన్ ని ఓడించి నాగిరెడ్డి రియల్ హీరో అయ్యారు. మరిపుడు ఆ పట్టు గాజువాకలో ఉందా అంటే నిరాశే సమాధానం అవుతుంది. ఎవరినీ పట్టించుకోకుండా నాగిరెడ్డి ఏకపక్షంగా వెళ్తున్నారు. ఆయన తన వారసుడిగా కుమారుడు దేవాన్ష్ రెడ్డికి బాధ్యతలు అప్పగించేశారు. దాంతో పార్టీ కకావికలం అయింది. ఇక ఎన్నో గ్రూపులు, గొడవలు. పైచేయి కోసం బహిరంగానే కొట్టుకుంటూ పార్టీ పరువు బజారుకు ఈడుస్తున్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో ఒకరికి టికెట్ ఇస్తే రెండవ వర్గం వారు ఓడిస్తామని మీడియా ముందే చెబుతున్నారంటే ఇక వైసీపీ సంగతి ఏంటో అర్ధం చేసుకోవాలిగా.ఇక పెందుర్తి నియోజకవర్గంలో యువ ఎమ్మెల్యే అదీప్ రాజు హవా చాటుతున్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో ఓ సాధారణ నాయకుడు. జగన్ ఆయన్ని చేరదీసి ఎమ్మెల్యేని చేశారు. మరి అదీప్ రాజు రాజకీయంగా సీనియర్, మాజీ మంత్రి అయిన బండారు సత్యనారాయణమూర్తిని ఓడించి రికార్డు సృష్టించారు. ఇక ఆయన ఎమ్మెల్యే అయ్యాక అసలైన వైసీపీ నేతలను పక్కన పెట్టి తెలుగుదేశం వారికి పెద్ద పీట వేస్తున్నారని క్యాడర్ వాపోతోంది. తాజాగా ఒక సీనియర్ కార్యకర్త పార్టీలో నిరాదరణ భరించలేక అనారోగ్యం తెచ్చుకుని మరీ కన్ను మూశారు. దానికి కారణం ఎమ్మెల్యే అంటూ సొంత పార్టీవారే ఆయన పరామర్శను అడ్డుకుని రచ్చ చేశారంటే పార్టీ పరువు ఎక్కడ ఉంది అన్నది సగటు కార్యకర్తల ఆవేదనగా ఉంది.భూ కబ్జాలు పెరిగిపోయాయని వైసీపీ అంటోంది. టీడీపీని టార్గెట్ చేసి ఆపరేషన్ స్టార్ట్ చేసింది. అయితే అదే సమయంలో వైసీపీ ఎమ్మెల్యేల మీద ఇలాంటి ఆరోపణలే జిల్లా అంతటా ఉన్నాయి. దీని మీద విజయసాయిరెడ్డి తీరు మార్చుకోమని తమ పార్టీ వారిని హెచ్చరించినా ఎవరూ స్పందించలేదు సరికదా టీడీపీకి దొరికిపోయేలా వ్యవహరిస్తున్నారు. చాలా మంది వైసీపీ ఎమ్మెల్యేల నియోజకవర్గాలలో భూ దందాలు జరుగుతున్నాయని టీడీపీ ఆరోపణలు చేస్తోంది. సర్వే నంబర్లూ సాక్ష్యాధారాలతో సహా బయట పెడుతోంది. మొత్తానికి తొందరలో లోకల్ బాడీ ఎన్నికలు ఉన్న వేళ పార్టీని పక్కన పెట్టి సొంత పనులతో అధికార పార్టీ పెద్దలు బిజీగా ఉన్నారన్నది వాస్తవం. ఇలాగైతే గత సార్వత్రిక ఎన్నికల రిజల్ట్ ఈసారి తిరగబడుతుందని విశ్లేషణలు అయితే గట్టిగానే ఉన్నాయి.

# మిర్చి రైతులకు నకిలీల బెడద



గుంటూరు, డిసెంబర్ 7, ( న్యూస్ పల్స్)నకిలీ విత్తనాల ఘాటు మిర్చి రైతుల నషాళానికి అంటుతోంది. ఇటీవల గుంటూరు జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోగా, ఇప్పుడు కృష్ణా జిల్లా రైతులకు నకిలీ విత్తనాల ఘాటు తగిలింది. నష్టపోయి వారికి పరిహారం ఇప్పించడంలో ప్రభుత్వం విఫలం అవుతుండడంతో రైతులను కొన్ని మిర్చి విత్తన కంపెనీలు మోసం చేస్తూనే ఉన్నాయి. కలాషా కంపెనీకి చెందిన 414, కుబేరా రకాల మిర్చి విత్తనాలను కృష్ణా జిల్లా నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు మండలాల్లోని 300 మంది రైతులు, కౌలు రైతులు 500 ఎకరాల్లో గత ఆగస్టు రెండో వారంలో నాటారు. ముందుగా విత్తనాలు కొని నారు పెంచడానికి ఎకరానికి రూ.25 వేలు, నాలుగుసార్లు దుక్కులు, నారు నాటడానికి, కలుపు తీయడానికి రూ.20 వేలు, ఎరువులకు రూ.20 వేలు, పురుగు మందులకు రూ.25 వేలు ఖర్చు పెట్టారు. సగటున ఎకరాకు రూ.90 వేల చొప్పున 500 ఎకరాల్లో మొత్తం రూ.4.5 కోట్ల మేర పెట్టుబడి పెట్టారు. ఎకరానికి రూ.25 వేలు కౌలు చెల్లించి వంద మందికిపైగా కౌలు రైతులు 200 ఎకరాలు సాగు చేస్తున్నారు. వీరికి కౌలుతో కలుపుకొని ఎకరానికి రూ.1.15 లక్షల వరకూ ఖర్చయింది. మిరప నాటిన 45 రోజుల్లో పూతకు వస్తుంది. మూడు నెలల్లో సగటున ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి రావాలి. మొక్క ఏపుగా పెరిగినా పూత రాలేదు. కాయ కాయలేదు. దీంతో, రైతులు, కౌలు రైతులకు రూ.5 కోట్ల మేర నష్టం వాటిల్లడంతో వారు లబోదిబోమంటున్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన కంపెనీల నుంచి నష్టపరిహారం ఇప్పించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. గుంటూరు జిల్లాలో నకిలీ విత్తనాల నష్టపోయి ఇటీవల రెండు వేల ఎకరాల్లో మిర్చి పంటను రైతులు పీకేశారు. మొక్క ఎదుగుదల బాగానే ఉన్నా పూత, పిందె రాలేదు. దీనిపై విత్తనాలను అమ్మిన వ్యాపారులను రైతులు నిలదీసినా వారి నుంచి సరైన సమాధానం లేదు. దీంతో, ఇండస్ వ్యాలీ కంపెనీకి చెందిన స్వర్ణ రకం, యుఎస్ 402, కావేరీ రకం విత్తనాలు వేసిన రైతులు తమ మొక్కలను పీకేశారు. జిల్లాలో రెండు వేల ఎకరాల్లో ఇటువంటి పరిస్థితి ఉంది. పెదకూరపాడు, అచ్చంపేట, మాచవరం, మేడికొండూరు, క్రోసూరు తదితర మండలాల్లో రైతులు ఎక్కువగా నష్టపోయారు. ఆయా కంపెనీల నుంచి నష్టపరిహారం ఇప్పించాలని రైతు సంఘాలు ఆందోళన నిర్వహించాయి. దీనిపై కంపెనీలు స్పందించడం లేదు. పంటను పీకేసిన రైతులు మరో పంటను వేయడానికి పెట్టుబడి వ్యయం లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

# నిరసనబాటలో ప్రభుత్వ ఉద్యోగులు

అమరావతి ఏపీలో మంగళవారం నుంచి ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ పెంపుతో పాటుగా పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఏపీ జేఏసీ, ఏపీ జేఏసీ అమరావతి సంయుక్తగా ఉద్యమ కార్యాచరణ ప్రకటించాయి. మంగళవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు అవుతారు. అయితే ఏపీ ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్, ఏపీ గెజిటెడ్ ఆఫీసర్స్ ఫోరమ్ మాత్రం ఉద్యమంలో పాల్గోనడంలేదు

# రైతులకు క్రషింగ్ కష్టాలు

విశాఖపట్టణం, డిసెంబర్ 7, (న్యూస్ పల్స్)విశాఖ జిల్లాలోని నాలుగు సహకార చక్కెర ఫ్యాక్టరీల్లో మరో రెండు మూతపడ్డాయి. రెండేళ్ల క్రితం తుమ్మపాల చక్కెర ఫ్యాక్టరీ క్రషింగ్ నిలిపివేసిన ప్రభుత్వం, తాజాగా ఈ సీజన్‌లో తాండవ, ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ఆపేసింది. దీంతో దాదాపు మూడువేల ఎకరాలకుపైగా సాగుచేస్తున్న చెరకు రైతులు నాలుగువేల మంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అకస్మాత్తుగా క్రషింగ్ నిలిపివేస్తే ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేయడానికి ఒప్పందం చేసుకున్న రైతులు ఏమవుతారన్న ఆలోచన లేకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పండించిన చెరకు ఎక్కడకు తీసుకెళ్లాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. సహకార రంగంలో మిగిలిన ఏకైక గోవాడ చక్కెర ఫ్యాక్టరీ కూడా ఇంకా క్రషింగ్ ప్రారంభించలేదు. గతేడాది నవంబరు 20న గోవాడ ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభించింది. ఈ ఏడాది డిసెంబరు వచ్చినా క్రషింగ్‌కు ఫ్యాక్టరీ సిద్ధం కాకపోవడంతో ఆ ఫ్యాక్టరీ పరిధిలోని రైతులూ ఆందోళనతో ఉన్నారు. క్రషింగ్ నిలిపివేసిన ప్రభుత్వం అందులో పనిచేస్తున్న కార్మికులు, రైతుల బకాయిపై మాట్లాడటంలేదు. క్రషింగ్‌కు సరిపడా చెరకు లేకపోవడంతో క్రషింగ్ చేయలేకపోతున్నట్లు అధికారులు బయటకు చెబుతున్నా, ప్రస్తుత పరిస్థితుల్లో ఫ్యాక్టరీల క్రషింగ్ మూసివేసి స్థిరాస్తులను తాకట్టుపెట్టి సొమ్ము చేసుకోవాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. తాండవ ఫ్యాక్టరీ పరిధిలోని రైతులకు రూ.10.65 కోట్లు, ఏటికొప్పాక రైతులకు రూ.8.58 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది.తాండవ ఫ్యాక్టరీ కార్మికులకు దాదాపు 32 నెలలు, ఏటికొప్పాక కార్మికులకు 17 నెలలుగా జీతాలు బకాయి ఉన్నాయి. కార్మికులు అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తు న్నారు. చెరకు పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, సరఫరా చేసిన రైతుకు సకాలంలో బకాయిలు చెల్లించక పోవడంతో రైతులు చెరకు సాగు పట్ల ఆసక్తి చూపడం లేదు. ఏటికొప్పాక ఫ్యాక్టరీని 1932లో ఏర్పాటు చేశారు. ఎంతో ఖ్యాతి కలిగిన ఈ ఫ్యాక్టరీని నిర్వీర్యం చేసి మూసివేయడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. 1999-2000లో రికార్డు స్థాయిలో 2.84 లక్షల టన్నులు చెరకు క్రషింగ్ చేసింది.

2000-21లో 10.60 శాతం రికవరీతో రాష్ట్రంలోని సహకార రంగ ఫ్యాక్టరీలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఫ్యాక్టరీని ఆధునీకీకరించి మద్దతు ధర, రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహక ధర చెల్లించి, సకాలంలో రైతుకు బకాయిలు చెల్లించివుంటే చెరకు సాగు పెరిగేది. తాండవ సుగర్ ఫ్యాక్టరీని 1962లో ఏర్పాటు చేశారు. 2006-07 వరకు సాఫీగా వెళ్లిన ఫ్యాక్టరీ పంచదార అమ్మకాలపై ఆంక్షలు విధించడంతో కష్టాల్లోకి నెట్టబడింది. ఈ రకంగా తాండవ, ఏటికొప్పాక ఫ్యాక్టరీలు ప్రభుత్వ విధానాల మూలంగా దెబ్బతిన్నాయి. వీటిని పరిరక్షించి రైతులు, కార్మికులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వదిలించుకోవాలని చూడటంతో రైతులు, కార్మికులు వీధినపడాల్సి వచ్చింది.

# బీటీ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తేవాలి

అనంతపురం అనంతపురం జిల్లా గుమ్మగట్ట మండలం లోని భైరవాని తిప్ప ప్రాజెక్ట్ రాయదుర్గం, కళ్యాణ్ దుర్గం నియోజకవర్గాలలో ఆయకట్టుకింద సాగు చేసే రైతులకు ఒక జీవనది లాంటిది . ఇప్పుడు బిటిపి ప్రాజెక్టుకు 1652 అడుగులకు మేర వరద నీరు చేరుకుంది. పది రోజులుగా ఎగువనున్న కర్ణాటక ప్రాంతం నుంచి వేదవతి, హగరి నది ద్వారా ప్రాజెక్టుకు వరద నీరు చేరుతుండడంతో నీటి మట్టం సామర్థ్యం పెరిగింది.1655 అడుగుల నీటి సామర్థ్యం తో ఉన్న ప్రాజెక్టుకు పూర్తిస్థాయి నీటి మట్టం చేరేందుకు మరో మూడు అడుగులు మాత్రమే ఉంది. వచ్చే రెండు రోజుల్లో కురిసే వర్షాలకు వరద నీటి ఇన్ఫ్లో పెరిగితే ఏక్షణంలోనైనా గేట్లు ఎత్తే ఆస్కారం ఉందని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో వేదవతి, హగరి నది పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. కాగా ప్రాజెక్టులో నీటి సామర్థ్యం పెరగడంతో ఎడమ కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండటంతో అధికారులు సౌకర్యాలపై దృష్టి పెట్టారు. కుడి ఎడమ కాలువ పరిధిలో సాగునీరు అందించేందుకు ముందస్తుగానే కాలువలు మరమ్మతులు చేసుకోవాలని ఆయా గ్రామాల్లో రైతులను అప్రమత్తం చేస్తున్నారు. వర్షానికి ప్రాజెక్ట్ రివిట్మెంట్ కుంగడంతో అధికారులు అప్రమత్తమై మరమ్మతు పనులు చేపట్టారు. ఎడమ పక్క కాలు కింద 8,400 ఎకరాలు, కుడి పక్క కాలువ కింద 4000 ఎకరాలలో రైతులు సాగు చేస్తూ జీవనం సాగించేవారు. అధికారులు ఈ ప్రాజెక్టు 1951లో ప్రారంభించి 1961లో ప్రాజెక్టు పూర్తి చేశారు. అప్పట్లో కర్ణాటక రాష్ట్రంలో చెక్ డ్యాములు లేనిపక్షంలో ప్రతి సంవత్సరం డ్యామ్ నిండడం వల్ల ఆయకట్టు కింద ఉన్న రైతులు సాగు చేసేవారు.ఇప్పుడు పరిస్థితి చూస్తే కర్ణాటక రాష్ట్రంలో చెక్ డ్యాంలు నిర్మించడంతో బీటీ ప్రాజెక్టుకు ఐదు సంవత్సరాలకు ఒకసారి కర్ణాటక రాష్ట్రంలో వర్షాలు బాగా కురిస్తే అక్కడ చెక్ డ్యామ్ నుండి వచ్చే నీరు బీటీ ప్రాజెక్టు కు చేరుకుంటుంది. ప్రాజెక్టు ఆయకట్టు కింద 12400 ఎకరాల్లో రైతులు సాగు చేసేవారు. ఆయకట్టు కింద ఆధారపడి సాగు చేసుకునే రైతులు నేడు పనులు లేక బెంగళూరు, హైదరాబాద్, చెన్నై ,ముంబై మహానగరాలకు వలసగా వెళ్లి జీవనం సాగిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీటీ ప్రాజెక్టుకు కృష్ణాజలాలు తీసుకు వస్తేనే శాశ్వత పరిష్కారం అంటున్నారు. ఎన్నికల సమయంలో ప్రస్తుతం రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి గెలిచిన మూడు నెలల్లోనే కృష్ణా జలాలు తెప్పిస్తానని హామీ ఇచ్చి నేటికీ రెండున్నర సంవత్సరాలు అవుతున్న బీటీ ప్రాజెక్టుకు నీరు తెప్పించడంలో విఫలమయ్యారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్పందించి బీటీ ప్రాజెక్టుకు కృష్ణా జలాలను తెప్పించి ఆయకట్టు కింద పంట సాగు చేస్తున్న రైతులను ఆదుకోవాల్సిన పరిస్థితి ఎంతైనా ఉందంటున్నారు. లేనిపక్షంలో గ్రామాలు వదిలి వలసలకు వెళ్లే పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు.

# అక్రమ మద్యం కోసం ఆటోల్లో ప్రత్యేక అరలు

విజయవాడ, డిసెంబర్ 7, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. అక్రమ మద్యం రవాణా మాత్రం ఆగడం లేదు. ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ అక్రమార్కులు పలు మార్గాల్లో మద్యం తరలిస్తూ పట్టుబడుతూనే ఉన్నారు. తాజాగా ఏపీ పోలీసులు జరిపిన తనిఖీల్లో తెలంగాణ నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అయితే.. నిందితుల ప్లాన్ చూసి పోలీసులే షాకయ్యారు. ట్రాలీ ఆటోలో ప్రత్యేకంగా అరలు తయారు చేసి.. ఎవరికీ అనుమానం రాకుండా దర్జాగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు రెండు ట్రాలీ ఆటోలను ఆపి తనిఖీలు నిర్వహించగా.. వారి ప్లాన్ కాస్త రివర్స్ అయింది. ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 400 మద్యం బాటిళ్లను జి.కొండూరు మండలంలోని కందులపాడు అడ్డరోడ్ వద్ద ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారుఖమ్మం నుంచి విజయవాడ కొత్తూరు తాడేపల్లికి అక్రమంగా తెలంగాణ మద్యాన్ని తరలిస్తుండగా.. ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారు. అనుమానంతో రెండు ట్రాలీ ఆటోలను ఆపి పరిశీలించారు. ఆటో ట్రక్కులో ప్రత్యేకంగా అరను ఏర్పాటు చేసి కేటుగాళ్లు మద్యాన్ని తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు ఆటో ట్రాలీలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారుకాగా.. ఆంధ్రప్రదేశ్‌లో మద్యంధరలుఅధికంగాఉండటంతో..కొంతమంది అక్రమా ర్కులు తెలంగాణ, పలు రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం బాటిళ్లను తరలించి క్యాష్ చేసుకుంటున్నారు. అయితే.. అక్రమ మద్యంపై ఏపీ పోలీసు లు గట్టి నిఘా ఏర్పాటు చేయడంతో.. వారి ఐడియాలు విఫలమవు తున్నాయి. ఇప్పటికే.. ఏపీలో కోట్లాది రూపాయల మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు తెలుస్తోంది.

# గల్లా క్యాంప్ దూరమేనా



గుంటూరు, డిసెంబర్ 7, (న్యూస్ పల్స్)లుగుదేశం పార్టీ అసలే కష్టాల్లో ఉంది. వరస ఓటములతో ఇబ్బంది పడుతుంది. పార్టీని ట్రాక్ లో పెట్టేందుకు చంద్రబాబు అష్టకష్టాలు పడుతున్నారు. అయినా ఫలితం లేకుండా పోతుంది. అధికారంలో ఉన్నప్పుడు చుట్టూ తిరిగిన నేతలు ఇప్పుడు మొఖం చాటేస్తున్నారు. అందులో గుంటూరు పార్లమెంటు సభ్యుడు గల్లా జయదేవ్ ఒకరు. గల్లా కుటుంబం టీడీపీకి దాదాపు దూరమయిందనే సంకేతాలు వస్తున్నాయి.. పార్టీ పై ప్రేమ ఉంటే కసిగా పోరాడాల్సింది అధికారంలో లేనప్పుడే. వదలించుకుని వెళదామనుకునే వారికి పార్టీ పట్టదు. అధినేతను కూడా కేర్ చేయాల్సిన అవసరం లేదు. గల్లా జయదేవ్ విషయంలో ఇప్పుడు అదే జరుగుతుంది. గల్లా జయదేవ్ కు రెండుసార్లు గుంటూరు ఎంపీ టిక్కెట్లు ఇచ్చి చంద్రబాబు గెలిపించుకున్నారు. పదేళ్ల పాటు పార్లమెంటు సభ్యుడిగా అవకాశమిచ్చారు. చిత్తూరు జిల్లా అయినప్పటికీ సామాజికవర్గం సమీకరణల్లో భాగంగానే గుంటూరు సీటును గల్లా జయదేవ్ దక్కించుకున్నారు. 2014లో గెలిచి ఐదేళ్లు బాగానే ఉన్నారు. ఎందుకంటే అప్పుడు టీడీపీ అధికారంలో ఉంది. గత కొంత కాలం నుంచి... కానీ ఇప్పుడు రెండున్నరేళ్ల నుంచి గల్లా జయదేవ్ లో స్పష్టమైన మార్పు కన్పిస్తుంది. తమ పరిశ్రమలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్న కారణం కావచ్చు. టీడీపీకి భవిష్యత్ లేదని కావచ్చు. కారణాలేవైనా గల్లా మాత్రం డిస్టెన్స్ చంద్రబాబుతో మెయిన్ టెయిన్ చేస్తున్నారు. తన నియోజకవర్గం పరిధిలో పార్టీ కార్యాలయంపై దాడి జరిగితే గల్లా తొంగి చూడలేదు. చంద్రబాబు 36 గంటల దీక్ష చేసినా రాలేదు. అంటే పార్టీ తనకు అవసరం లేదన్న భావనతోనే ఉన్నారనుకోవాలి. ఇక స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోనూ తన నియోజకవర్గం పరిధిలో జోక్యం చేసుకోలేదు. దీంతో పాటు అమరావతి రైతులు 37 రోజుల నుంచి పాదయాత్ర చేస్తున్నా గల్లా జయదేవ్ పట్టించుకోలేదు. కనీసం వారిని పలకరించిన పాపాన పోలేదు. త్వరలోనే ఆయన సొంత జిల్లాలోకి పాదయాత్ర ఎంటర్ కాబోతుంది. పరిస్థితులను చూస్తుంటే గల్లా జయదేవ్ టీడీపీకి త్వరలోనే గుడ్ బై చెప్పేస్తారన్న టాక్ పార్టీలోనే నడుస్తుంది. చంద్రబాబు కూడా గల్లాను పట్టించుకోవడం మానేశారని పార్టీ నేతలే చెబుతుండటం విశేషం. మొత్తం మీద గల్లా ఎందుకు సైలెంట్ అయ్యారన్నది ఆయన గొంతు విప్పితేనే తెలుస్తుంది.

# కడప కార్పొరేషన్ లో ఆలీబాబా నలభై తొమ్మిది దొంగలు

## టిడిపి కడప నియోజకవర్గ ఇన్చార్జ్ అమీర్ బాబు

కడప డిసెంబర్07 కడప కార్పొరేషన్ లో అభివృద్ధిని పక్కనపెట్టి ప్రజా సమస్యలు పట్టని నట్టు అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లు వాటాల కోసం గొడవ పడడం విడ్డూరంగా ఉందని కడప తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ అమీర్ బాబు అన్నారు మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు వైసిపి పార్టీకి 49 మంది ని గెలిపిస్తే గెలిపించిన ప్రజలకు మెరుగైన సేవలందించకుండా పంపకాల కోసం రోడ్డు మీదికికొచ్చి రచ్చ చేసుకుంటున్నారని అన్నారు సొంత జిల్లా వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యాడని ప్రజలు సంతోష్ ఇస్తుంటే మనకు ఏదో చేస్తారు అనుకుంటే వీళ్లు మాత్రం వాటాలకు కొట్లాడుకుంటున్నారు ఉందన్నారు సాక్షాత్తు ముఖ్యమంత్రినే జిల్లాకు వరాల జల్లు కురిపించి నగరాన్ని అద్భుతంగా మారుస్తామని ప్రజలకు చెప్పి హైదరాబాద్ తరహాలో ట్యాంక్బండ్ నిర్మిస్తామని కృష్ణ థియేటర్ నుండి దేవుని కడప వరకు రోడ్డు వెడల్పు చేస్తామని చెప్పి ఇవి చేయకుండా ఎల్ఐసి సర్కిల్ నుండి వాళ్లకు అవసరం ఉన్నచోట వాళ్ళ వెంచర్లు వేసుకునే చోట రోడ్లు వేసుకున్నారని దుయ్యబట్టారుఇప్పటికైనా మారి వాటాలు పక్కనపెట్టి ప్రజాసమస్యలపై పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని అన్నారు నగరానికి వరదలు వచ్చి ప్రజలు అల్లాడుతుంటే తూతూమంత్రంగా 2500రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ సమావేశంలో పార్లమెంట్అధికార ప్రతినిధి ఆమూరీ బాల దాసు నగర అధ్యక్షులు సానపురెడ్డ శివ కొండా రెడ్డి 12వ డివిజన్ఇన్చార్జి సానపురెడ్డి రవి శంకర్ రెడ్డి ,నక్కల. శివరాం, మైనార్టీ మైనార్టీ మైనార్టీ మైనార్టీ నాయకులు అబ్దుల్లా లు పాల్గొన్నారు.

# సర్వభూపాల వాహనంపై దర్శనమిచ్చిన పద్మావతి అమ్మవారు

తిరుమల డిసెంబర్ 7 తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ఎనిమిదో రోజైన మంగళవారం ఉదయం రథోత్సవానికి బదులుగా సర్వభూపాల వాహనంపై పద్మావతి అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయం వద్దగల వాహన మండపంలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు అమ్మవారి వాహనసేవ ఏకాంతంగా జరిగింది.కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చినజీయర్ స్వామి, టీటీడీ బోర్డు సభ్యుడు, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో కస్తూరిబాయి, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, పాంచరాత్ర ఆగమసలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్లు శేషగిరి, మధుసుదన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్ కన్నా తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ దళాల పతాక దినోత్సవం

## ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్

విజయవాడ, డిసెంబర్ 7 సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీ ని జిల్లా కలెక్టర్ జె. నివాస్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశం కోసం అమరులైన జవాన్లను ఈ ఫ్లాగ్ డే నాడు స్మరించుకుంటు వారి కుటుంబాల సంక్షేమం కోసం సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళాలు అందిద్దాం . త్యాగానికి.ప్రతిరూపం సైనికులు వారిని ఆదుకోవడం మన బాధ్యత. మనదేశ.భవిష్యత్తు కోసం రక్షణ కోసం పాటుపడుతున్న జవానుల సంక్షేమం చాలా చాలా ముఖ్యం . దేశం కోసం పోరాడి వీరమరణం పొందిన సైనిక కుటుంబాలు, మాజీ సైనిక కుటుంబాల సంక్షేమం కోసం విరాళాలు ఇచ్చి ప్రతి ఒక్కరం దేశభక్తి చాటాడమే కాదు అమరులకు నివాళులు అర్పించినట్లు అవుతుందని అన్నారు.

# ఏపీ ఎన్జీవోల సమ్మెలో చీలిక ?



అమరావతి డిసెంబర్ 7ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం నుండి ఉద్యోగ సంఘాలు చేయాలని అనుకుంటున్న సమ్మెలో చీలిక వచ్చిందా ? అంటే అవునని స్పష్టమవుతుంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అందరికీ ఇదే అనుమానాలు పెరిగిపోతున్నాయి. ఏపీ ఎన్జీవో అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు ముందుగా ప్రకటించిన ప్రకారమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులందరు ఈరోజు నుండి సమ్మెలోకి దిగాలి. సమ్మె ప్రారంభ సూచకంగా కొద్దిరోజులు నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని ఉద్యోగాలకు హాజరవ్వాలని డిసైడ్ అయ్యింది.అయితే పై నేతల ప్రకటనలతో తాము విభేదిస్తున్నట్లు ఏపీ ట్రెజరీ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలు ప్రకటించారు. సమ్మెలో ట్రెజరీ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ ఉద్యోగులెవరు పాల్గొనటం లేదని వీళ్ళు స్పష్టంగా ప్రకటించారు. పీఆర్సీ తదితర కీలకమైన డిమాండ్ల పరిష్కారం కోసం 7వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మె మొదలు పెట్టనున్నట్లు కొద్దిరోజులుగా ఏపీ ఎన్జీవో నేతలు చెబుతున్న విషయం తెలిసిందే. అయితే చివరి నిమిషంలో వీళ్ళతో ట్రెజరీ ఉద్యోగ సంఘం నేతలు విభేదించిన ట్లు సమాచారం. పీఆర్సీని 10 రోజుల్లో ప్రకటిస్తానని తిరుపతి పర్యటనలో జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని ట్రెజరీ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ గుర్తుచేశారు.పీఆర్సీ ప్రకటనపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాత కూడా ఏపీ ఎన్జీవో నేతలు సమ్మె చేయాల్సిందే అని డిసైడ్ చేయటాన్ని తాము అంగీకరించమన్నారు. సీఎం చెప్పిన 10 రోజుల గడువు ముగిసే వరకు వెయిట్ చేయాల్సిందే కదాని ఆయన ప్రశ్నిస్తున్నారు. సీఎం ఇచ్చిన హామీకి తగ్గట్లుగా ప్రభుత్వం చర్యలు లేకపోతే అప్పుడు ఏమి చేయాలనే విషయంలో నిర్ణయం తీసుకోవడం సబబుగా ఉంటుందని రవికుమార్ సూచించారు. ఉద్యోగుల అధికారుల సంక్షేమం విషయంలో సీఎం సానుకూలంగా నిర్ణయం తీసుకుంటారన్న విశ్వాసం తమకున్నట్లు కూడా రవికుమార్ చెప్పారు.తాజాగా ట్రెజరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడి మాటలను బట్టి ఈరోజు నుంచి మొదలయ్యే సమ్మెలో కొందరు ఉద్యోగులు పాల్గొనడం లేదని తేలిపోయింది. అంటే దీనర్థం ఏమిటంటే సమ్మె చేసే విషయంలో ఉద్యోగ సంఘాల్లోనే చీలిక వచ్చిందని. మరోవైపు ప్రభుత్వాన్ని కూల్చే శక్తి లేదా నిలబెట్టే శక్తి తమకుందని తాను చేసినట్లుగా ప్రచారంలో ఉన్న వ్యాఖ్యలను బండి శ్రీనివాసరావు ఖండించారు. పార్టీలను అధికారంలోకి తీసుకొస్తామని లేదా ఓడగొడతామని తాను ఎక్కడా వ్యాఖ్యలు చేయలేదని బండి ఇపుడు నెత్తీ నోరు మొత్తుకుంటున్నారు. తాను అనని వ్యాఖ్యలను అన్నట్లుగా ఒ సెక్షన్ మీడియా కావాలనే ప్రచారం చేస్తోందని మండిపోయారు.ఏదేమైనా ఉద్యోగ సంఘాల తాజా వైఖరి చూసిన తర్వాత సమ్మె చేసే విషయంలో చీలికలు వచ్చినట్లు అర్ధమైపోతోంది. ఒకసారి బాహాటంగా ట్రెజరీ ఉద్యోగులు సమ్మెకు వ్యతిరేకమని చెప్పిన తర్వాత మిగిలిన ఉద్యోగ సంఘాల నేతల్లో కూడా ఇలాంటి ఆలోచన వచ్చే అవకాశాలున్నాయి. ఇదే విషయాన్ని ఎంఎల్సీ మాజీ ఉద్యోగ సంఘాల నేత వెన్నపూస గోపాలరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగులు సమ్మె చేయటం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. సమ్మె చేయటం అన్నది చివరి అస్త్రంగా ఉండాలని చెప్పారు. 10 రోజుల్లో పీఆర్సీ ప్రకటిస్తామని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించిన తర్వాత అప్పటివరకు వెయిట్ చేస్తే బాగుంటుందని సూచించారు.

# నేడు, రేపు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవం ...

కడప డిసెంబర్ 07 కడప నగరం సమీపంలోని రిమ్స్ వద్ద వున్న రామచంద్రయ్య కాలనీలో వెలసివున్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం, గురు వారం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు జోగినేని రామ చంద్రయ్య, నిర్వాహకులు జోగినెని చంద్ర కుమార్ లు తెలిపారు. ఈ సందర్భంగా రామ చంద్రయ్య మాట్లాడుతూ బుధవారం ఉదయం 5 గంటల నుంచి సుబ్రవ్రతా సేవ, ధ్వజ రోహనం, నవగ్రహ పూజ, పాల కవిడి, పూల కావిడి తో పాటు సాయంత్రం అమ్మవారికి, స్వామివారికి విడిది కార్యక్రమం, ఏదురుకోల్ల కార్యక్రమం వుంటుందన్నారు. గురువారం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. 12 గంటలకు వేలాది మందికి అన్న ప్రసాద కార్యక్రమం వుంటుందన్నారు. కావున భక్తులు స్వామి వారి కళ్యాణ మహోత్సవమునకు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

# జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తుగ్గలి డిసెంబర్ 07ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సంపూర్ణ గృహ కు పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని శభాష్ పురం గ్రామ మాజీ సర్పంచ్ హనుమంతు తెలియజేశారు. మంగళవారం రోజున తుగ్గలి మండలం పరిధిలోని గల శభాష్ పురం గ్రామ సచివాలయం నందు రామకృష్ణ అనే లబ్దిదారునికి జగనన్న సంపూర్ణ గృహ పథకం ధ్రువ పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ హనుమంతు మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటివరకు నలుగురు లబ్ధిదారులు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథక ధ్రువ పత్రాన్ని పొందారని తెలియజేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ద్వారా ప్రజలకు ఎన్నో లాభాలు ఉన్నాయని ఆయన తెలియజేశారు.ఇంటి రిజిస్ట్రేషన్ కు ఎంతో ఖర్చు అయ్యే ఇప్పటి పరిస్థితులలో,రాష్ట్ర ప్రభుత్వం కేవలం పది వేల రూపాయలకే ఇంటిని లబ్ధిదారుల పేరు మీద శాశ్వత గృహ పథక ధ్రువ పత్రాన్ని అందజేస్తుందని ఆయన తెలియజేశారు.కావున ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రవి,సచివాలయ సిబ్బంది మరియు గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# కత్తిదాడిలో కుటుంబానికి గాయాలు

చిత్తూరు ఓ కుటుంబంపై మరో కుటుంబం కత్తితో దాడి జరిపింది. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం చిన్నమరెడ్డి కండ్రిక లో ఘటన జరిగింది. వీధి లైట్లు వెలగకుండా ఉండేందుకు కారణం సచివాలయం ఉద్యోగి కారణమని దాడి జరిగింది. దాడి లో గాయపడ్డ నాగలాపురం సచివాలయం విద్యుత్ అసిస్టెంట్ గా పనిచేసే కె.రాజా, తల్లి వల్లెమ్మ, తండ్రి దొరస్వామి ,తమ్ముడు గోపిని రుయా ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వెదురుకుప్పం ఎస్సై గోపి దర్యాప్తు చేస్తున్నారు.

# జగన్ అన్న పెళ్లి కానుక ..మరిచావా

కడప డిసెంబర్ 07 ప్రభుత్వ ఆదాయ వనరుల కోసం కొత్త కొత్త పథకాలను తీసుకువస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నాటి వాగ్దానం అయినా పెళ్ళికానుక దుల్హన్ పథకం అటక ఎక్కించడం తగునా? అని, రాయలసీమ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి తస్లిమ్ అన్నారు.రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం నందు విలేకరులతో అమె మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తి గడచినా, దుల్హన్ పథకం పూసే లేకపోవటం మైనారిటీ వర్గాలకు తీరని అన్యాయం చేశారని ఆమె అన్నారు. మైనారిటీలకు పెద్దపీట వేయడం అంటే ఇదేనా అని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిన్న మొన్న తీసుకొచ్చిన ఓ టి ఎస్ పై ఉన్న పట్టుదల ఎన్నికల వాగ్దానం నాటి దుల్హన్ పథకం పెళ్లికానుక పై ఎందుకు పెట్టారని ఆమె అడిగారు, కష్టకాలంలో ఉన్న ప్రజలపై ఓ టి ఎస్ పేరుతో 20 వేల రూపాయలు తీసుకోవడం తగదని, అర్హులైన వారందరికీ ఉచితంగా ఓ టి ఎస్ చేయాలని ఆమె అన్నారు. మైనారిటీ మంత్రిగా ఉన్న, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా గారు మైనారిటీ హక్కులను, వాగ్దానాలను దుల్హన్ పథకం అమలులో పూర్తిగా వెనుకబడ్డారు అని ఆమె అన్నారు, పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో దుల్హన్ పథకాన్ని అమలు చేసిన ముఖ్యమంత్రి, మన రాష్ట్రంలో ఎప్పుడు అమలు చేస్తారో తెలపాలని ఆమె కోరారు. రాష్ట్రంలోని మైనారిటీ ప్రజలను, అన్ని విధాలా ఆదుకుంటారాని ఆశతో ఎదురు చూశారని, ఈరోజు మీరు వారిని విస్మరిస్తే, వచ్చే రోజులలో వారు మిమ్మల్ని విస్తరించవచ్చు నని ఆమె తెలిపారు.

# కోవిడ్ మహమ్మారి థర్డ్‌వేవ్‌ను ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉండాలి




**ఆస్పత్రుల్లో ఆక్సిజన్ పైప్ లైన్, మౌలిక సదుపాయాలు సరిగ్గా ఉన్నాయో లేదో చెక్ చేయండి**
**విలేజ్ కోవిడ్ కేర్ సెంటర్ లో కాన్సన్ట్రేటర్స్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టండి**
**వైద్యపరంగా కావలసిన మందులన్నీ అందుబాటులో ఉంచుకోవాలి**
**కోవిడ్ బాధితులకు 90% పీహెచ్సీల్లోనే మెరుగైన వైద్యం అందేలా మౌలిక వసతులు కాన్సన్ట్రేటర్స్, ఆక్సిజన్ సిలిండర్ లను సిద్ధం చేయండి**
**:వైద్యాధికారులను ఆదేశించిన కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు**

కర్నూలు( విభారె) , డిసెంబర్ 07 :-కోవిడ్ మహమ్మారి థర్డ్‌వేవ్‌ను ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉండాలని వైద్యాధికారులను కర్నూలుజిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ లో కోవిడ్ థర్డ్‌వేవ్ సంసిద్ధతపై జిజి హెచ్ సూపరింటెండెంట్, కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, డీఎంహెచ్ఓ, నంద్యాల జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య అధికారులతో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ థర్డ్ వేవ్ ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో హాస్పిటల్లో ప్రిపరేషన్ పనులన్నీ పూర్తి చేయాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఒకవేళ థర్డ్ వేవ్ వస్తే అందుకు కావాల్సిన బెడ్లు అందుబాటులో ఉన్నాయా, జిజిహెచ్, నంద్యాల జిల్లా ఆస్పత్రి, ఆదోని ఏరియా ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పీహెచ్సీలో ఎన్ని బెడ్స్ అందుబాటులో ఉన్నాయి, అందులో ఆక్సిజన్ బెడ్స్ ఎన్ని, నాన్ ఆక్సిజన్ బెడ్స్ ఎన్ని, వెంటిలేటర్లు ఎన్ని ఉన్నాయి, డి టైప్ సిలిండర్లు ఎన్ని ఉన్నాయి, ఇంకా కావలసినవి ఏమైనా ఉన్నాయా, ప్లాన్ ప్రకారం సిద్ధం చేసుకోవాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. హాస్పిటల్స్ లో ఉన్న ఆక్సిజన్ పైప్ లైన్ సరిగ్గా ఉన్నాయో లేదో చెక్ చేయాలని డిఎం హెచ్ ఓను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పి ఎస్ ఐ ప్లాంట్ సంబంధించి ప్రెజర్ వస్తుందో లేదో చెక్ చేసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆక్సిజన్ పైప్లైన్ సరిగా ఉందో పరిశీలించి ఏవైనా సాంకేతికపరమైన ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలి అన్నారు. వెంటిలేటర్ల ను ఆపరేట్ చేసే సాంకేతిక నిపుణులను వెంటనే గుర్తించి మ్యాప్ చేసి వారికి శిక్షణ ఇచ్చి సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా కోవిడ్ బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. డి టైపు సిలిండర్లు ఎన్ని అందుబాటులో ఉన్నాయి, ఇంకా ఎన్ని అవసరం ఉంటుందో యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. కోవిడ్ నేపథ్యంలో జిల్లా కేంద్రం నుంచి దూరంగా ఉన్న ఆస్పత్రుల్లో మూడు రోజులకు సరిపడా ఆక్సిజన్ స్టాక్ ఉండేలా చూసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు అయిపోయే ముందుగానే ఆక్సిజన్ సిలిండర్లు తెప్పించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్సీ, సబ్ సెంటర్లలో ఎన్ని కాన్సన్ట్రేటర్స్ అందుబాటులో ఉన్నాయి వంటి వివరాలను డి ఎం హెచ్ ఓను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కోవిడ్ బాధితులకు 90% పీహెచ్సీల్లోనే మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కోవిడ్ కేర్ సెంటర్ లో ఏవైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలన్నారు. విలేజ్ కోవిడ్ కేర్ సెంటర్ లో కాన్సన్ట్రేటర్స్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో నోటిఫై చేసిన 36 ప్రైవేట్ హాస్పిటల్ లో మౌలిక వసతులు ఉన్నాయా లేవో మెడికల్ టీం మెంబెర్స్ వెళ్లి చెక్ లిస్ట్ ప్రకారం అన్నీ ఉన్నాయి లేవో చెక్ చేసి రిపోర్టు ఇవ్వాలని డీఎంహెచ్వో ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య అధికారులు అప్రమత్తంగా ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రతిరోజు వార్డులలో తనిఖీలు చేయాలని సూపరింటెండెంట్ ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామ, మండల జిల్లా స్థాయిలో ఉన్న కోవిడ్ కేర్ సెంటర్లలో వసతులు ఏమేమి ఉన్నాయి లేదో లిస్ట్ తెప్పించుకోవాలన్నారు. గతంలో కోవిడ్ చికిత్స కోసం వినియోగించిన అన్ని ఆసుపత్రులలో సదుపాయాలు సరిగ్గా ఉన్నాయా? ఇవన్నీ సరి చూసుకోవాలన్నారు. వైద్యపరంగా కావలసిన మందులన్నీ అందుబాటులో ఉంచుకోవాలి అన్నారు. అన్ని ప్రభుత్వ , ప్రైవేట్ ఆసుపత్రులలో ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్స్ ఎన్ని ఉన్నాయి, ఎన్ని ఏర్పాటు చేశారు వంటి వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు, డీటైప్ సిలెండర్లు ఎన్ని అందుబాటులో ఉన్నాయి వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కటి చేయాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ×సమీక్షలో జాయింట్ కలెక్టర్ (రెవిన్యూ , రైతు భరోసా) రామ సుందర్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.జిక్కి , జిజి హెచ్ సూపరింటెండెంట్ నరేంద్రనాద్ రెడ్డి, నంద్యాల జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కర్నూల్ లో వక్ఫ్ ట్రిబ్యునల్ జీవో జరిచేసిన రాష్ట్ర ప్రభుత్వం

**రాష్ట్ర ముఖ్యమంత్రికి , వక్ఫ్ ట్రిబ్యునల్ కోసం కృషిచేసిన కర్నూల్ ఎమ్మెల్యే యం.ఎ హాఫిజ్ ఖాన్ కి కృతజ్ఞతలు తెలిపిన కర్నూల్ ముస్లిం మత పెద్దలు , కార్పొరేటర్లు**

కర్నూలు ( విభారె) డిసెంబరు 07 :-వైస్సార్సీపీ మాటల ప్రభుత్వం కాదు మాటను కట్టుబడి ఉంటూ చేసి చూపించే సత్యం కేవలం వైయస్సార్ ప్రభుత్వానికే దక్కుతుందని కర్నూల్ ముస్లిం మత పెద్దలు , కార్పొరేటర్లు చెప్పారు. వక్ఫ్ భూముల ఆస్తుల పరిరక్షణ కోసం వక్ఫ్ ట్రిబ్యునల్ సంస్థ చాలా ఉపయోగపడుతుందని పార్టీ నాయకులు , కార్పొరేటర్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ ట్రిబ్యునల్ సంస్థను కర్నూల్ లో ఏర్పాటు చేయడం వలన కర్నూల్ ముస్లిం మత పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి గంధం చంద్రుడు సోమవారం జీవో జారీ చేశారు. వక్ఫ్ చట్టం 1995 లోని సెక్షన్ 83వ ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో విజయవాడ లో ఉన్న వక్ఫ్ ట్రిబ్యునల్ ను వినియోగించుకుంటున్నారు.

# పొడి చర్మం మృదువుగా చేయడానికి, ఇంట్లో తయారుచేసిన ఈ స్క్రబ్‌లను ఉపయోగించండి



పొడి చర్మంతో సమస్యలున్నాయా? ముఖం యొక్క కాంతిని కోల్పోతున్నారా? చలికాలంలో చర్మం పగిలి, పొక్కులు లేస్తున్నాయా? ప్రకాశవంతమైన చర్మాన్ని పొందడానికి ఇంట్లో తయారుచేసిన స్క్రబ్‌ని ఉపయోగించండి. ఇది చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది, చనిపోయిన చర్మ కణాలను తొలగించడంలో సహాయపడుతుంది. ఇది అకాల వృద్ధాప్యాన్ని నివారిస్తుంది మరియు చర్మాన్ని మృదువుగా ఉంచడంలో సహాయపడుతుంది. అలాగే చర్మంలోని తేమను కాపాడుకోవడం ద్వారా చర్మాన్ని ఆరోగ్యవంతంగా మార్చుతుంది. అయితే ఇంట్లో స్క్రబ్ ఎలా తయారు చేయాలో తెలుసుకోండి. 1) ఓట్ మీల్ మరియు పెరుగు స్క్రబ్ఓట్స్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి, ఇవి చర్మాన్ని బాగా ఉంచుతాయి. పెరుగులో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మం పొలుసు ఊడిపోవడంలో సహాయపడుతుంది మరియు జోజోబా ఆయిల్ లేదా కొబ్బరి నూనె చర్మ తేమను కాపాడడంలో సహాయపడుతుంది. ఈ స్క్రబ్ చేయడానికి, రెండు టీస్పూన్ల ఓట్ మీల్, ఒక టీస్పూన్ పెరుగు మరియు ఒక టీస్పూన్ జోజోబా ఆయిల్ లేదా కొబ్బరి నూనెను కలిపి పేస్ట్‌లా తయారు చేయండి. తర్వాత ఆ పేస్ట్‌ని తీసుకుని 30-60 సెకన్ల పాటు వృత్తాకారంలో మసాజ్ చేయాలి. చివరగా, మీ ముఖాన్ని గోరువెచ్చని నీటితో కడగాలి. ఈ ఆరు విటమిన్లు ప్రకాశవంతమైన మరియు ఆరోగ్యకరమైన చర్మానికి ఉత్తమమైనవి ...ఈ ఆరు విటమిన్లు ప్రకాశవంతమైన మరియు ఆరోగ్యకరమైన చర్మానికి ఉత్తమమైనవి ...2) తేనె మరియు ఓట్స్ స్క్రబ్ఈ స్క్రబ్ చర్మం యొక్క తేమను నిర్వహించడానికి మరియు మొటిమల సమస్యను తొలగించడానికి చాలా సహాయపడుతుంది. తేనె సహజమైన ఎక్స్‌ఫోలియేటర్‌గా మరియు మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. ఈ స్క్రబ్ చేయడానికి, 1/4 కప్పు ఓట్ మీల్, 1/6 కప్పు తేనె మరియు 1/6 కప్పు జొజోబా ఆయిల్ మిక్స్ చేసి పేస్ట్ చేయండి. తర్వాత ఆ పేస్ట్‌ని తీసుకుని చర్మంపై వృత్తాకారంలో ఒక నిమిషం పాటు మృదువుగా మసాజ్ చేయండి. చివరగా గోరువెచ్చని నీటితో బాగా కడగాలి. 3) కాఫీ స్క్రబ్ పొడి చర్మం విషయంలో, కాఫీ స్క్రబ్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది సహజంగా చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది మరియు డెడ్ స్కిన్ సెల్స్‌ను తొలగిస్తుంది, చర్మాన్ని లోపలి నుండి శుభ్రపరుస్తుంది. ఫలితంగా, చర్మం మృదువుగా మరియు మృదువుగా ఉంటుంది. ఈ స్క్రబ్ చేయడానికి, ఒక టీస్పూన్ కాఫీ పౌడర్‌ను ఒక టీస్పూన్ నీటిలో కలిపి పేస్ట్‌లా తయారు చేయండి. తర్వాత ఈ పేస్ట్‌ని వృత్తాకారంలో 4-6 నిమిషాల పాటు సున్నితంగా మసాజ్ చేయండి. తర్వాత మీ ముఖాన్ని బాగా కడగాలి.ఆరోగ్యకరమైన చర్మాన్ని పొందడానికి స్ట్రాబెర్రీ ఫేస్ ప్యాక్ ఉపయోగించండిఆరోగ్యకరమైన చర్మాన్ని పొందడానికి స్ట్రాబెర్రీ ఫేస్ ప్యాక్ ఉపయోగించండి4) కొబ్బరి నూనె మరియు నిమ్మకాయ స్క్రబ్పొడి చర్మానికి ఇది చాలా మేలు చేస్తుంది. నిమ్మకాయ చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది మరియు చర్మాన్ని మృదువుగా ఉంచడంలో సహాయపడుతుంది. కొబ్బరి నూనె చర్మ తేమను కాపాడుకోవడంలో చాలా సహాయపడుతుంది. ఈ స్క్రబ్ చేయడానికి, అరకప్పు కొబ్బరి నూనెలో రెండు టీస్పూన్ల చక్కెర మరియు ఒక టీస్పూన్ నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని శుభ్రమైన ముఖంపై అప్లై చేసి, వృత్తాకారంలో మృదువుగా మసాజ్ చేసి, కాసేపటి తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ స్క్రబ్ చేయడానికి కొబ్బరి నూనెకు బదులుగా, ఆలివ్ ఆయిల్ లేదా బాదం నూనెను ఉపయోగించవచ్చు. 5) అరటి మరియు వోట్మీల్ స్క్రబ్అరటిపండ్లు పొటాషియం, విటమిన్ ఎ మరియు సి యొక్క గొప్ప మూలం. పొడి మరియు జిడ్డుగల చర్మానికి ఈ స్క్రబ్ చాలా ప్రభావవంతంగా ఉంటుంది. దీన్ని తయారు చేయడానికి, ముందుగా పండిన అరటిపండును బాగా పేస్ట్ చేయండి. అందులో రెండు టీస్పూన్ల ఓట్ మీల్ మరియు ఒక టీస్పూన్ పెరుగు కలపాలి. ఈ మిశ్రమంతో, 30-60 సెకన్ల పాటు వృత్తాకార కదలికలో తేలికగా మసాజ్ చేయండి. తర్వాత మీ ముఖాన్ని బాగా కడగాలి.

## 'శవాన్ని కాల్చేస్తారు.. బూడిదను తీసుకువెళ్తారు'.. బ్లిగ్ పెళ్లి.. అసలు బూడిద ఉన్న ట్రోఫీ ఎక్కడ?

క్రికెట్ ప్రేమికులు ఎంతగానో ఎదురు చూస్తున్న యాషెస్ సిరీస్‌కు సమయం ఆసన్నమైంది. గబ్బా వేదికగా డిసెంబరు 8న తొలి టెస్టు ఆరంభం కానుంది. ఈ క్రమంలో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం ఇప్పటికే ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లను ప్రకటించాయి. ప్రపంచకప్ గెలవకపోయినా క్షమిస్తారు గానీ.. యాషెస్‌లో ఓటమిని మాత్రం జీర్ణించుకోలేరు ఇరు దేశాల అభిమానులు. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న యాషెస్ సిరీస్‌కు ఆ పేరు ఎలా వచ్చింది? ఈ ప్రతిష్టాత్మక సిరీస్‌కు ఉన? ప్రత్యేకత ఏమిటి తదితర అంశాలు తెలుసుకుందాం!క్రికెట్‌కు పుట్టినిల్లు ఇంగ్లండ్ అంటారు కదా! అలాంటిది ఇంగ్లండ్‌కు సొంతగడ్డ మీదే ఆస్ట్రేలియా చేతిలో ఘోర పరాభవం ఎదురైంది. 1882 ఆగష్టు 29న ఓవల్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ఆసీస్.. ఆతిథ్య జట్టును మట్టికరిపించింది. అంతకు ముందు ఎన్నో మ్యాచ్‌లు ఆడినా... ఇంగ్లండ్‌కు స్వదేశంలో ఆసీస్ చేతిలో ఇదే తొలి ఓటమి. ఈ నేపథ్యంలో స్పోర్టింగ్ టైమ్స్ అనే బ్రిటిష్ పత్రిక ఈ ఘోర అవమానాన్ని అభివర్ణిస్తూ... "ఇంగ్లండ్ క్రికెట్ చచ్చిపోయింది. శవాన్ని కాల్చేస్తారు.. ఆ బూడిదను ఆస్ట్రేలియాకు తీసుకువెళ్తారు" అంటూ కథనం ప్రచురించింది.

# మరో ఛాలెంజింగ్ పాత్రలో సమంత .. 'యశోద'గా థ్రిల్ చేసేందుకు సామ్ రెడీ



'ది ఫ్యామిలీ మేన్ 2' సిరీస్ సమంత కెరీర్ని ఊహించని స్థాయికి తీసుకెళ్లింది. ఈ చిత్రంతో సామ్ బాలీవుడ్ మేకర్లతో పాటు హాలీవుడ్ మేకర్లని కూడా ఆకర్షించింది. మనోజ్ బాజ్ పాయ్ కీలక పాత్రలో నటించగా రాజ్ ఎన్ డీకే తెరకెక్కించిన ఈ సిరీస్లో రాజీగా సమంత అభినయం విమర్శకుల ప్రశంసల్ని కురిపించింది. ఈ సిరీస్తో తన స్థాయిని మరింతగా పెంచుకున్న సామ్ తదుపరి ప్రాజెక్ట్ల కూడా అంతే స్పెషల్ గా వుండేలా ప్లాన్ చేసుకుంటోంది.ఇప్పటికే గుణశేఖర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న 'శాకుంతలం'ని పూర్తి చేసిన సమంత జెట్ స్పీడుతో తదుపరి ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తోంది. ఇటీవల ఓ హాలీవుడ్ ప్రాజెక్ట్ లో బోల్డ్ పాత్రని అంగీకరించి టాలీవుడ్ వర్గాలకు షాక్ ఇచ్చిన సమంత తాజాగా మరో ఛాలెజింగ్ రోల్లో కనిపించడానికి రెడీ అయిపోయింది. ఈ చిత్రాన్ని శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఓ విభిన్నమైన కథతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'యశోద' అనే టైటిల్ని ఖరారు చేశారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ సోమవారం లాంఛనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సమంత కూడా ఈ రోజే ఈ ప్రాజెక్ట్ లోకి ఎంటరైంది. సరికొత్త కథతో రూపొందుతున్న ఈ మూవీకి ఇద్దరు యువకులు హరి - హరీష్ దర్శకత్వం వహిస్తున్నారు. 'ది ఫ్యామిలీమెన్ 2' సిరీస్తో సమంతకు జాతీయ స్థాయిలో క్రేజ్ ఏర్పడింది. ఆ క్రేజ్ ని.. పెరిగిన ఆమె మార్కెట్ ని దృష్టిలో పెట్టుకుని 'యశోద' చిత్రాన్ని తెలుగు తమిళం కన్నడ మలయాళ హిందీ భాషల్లో విడుదల చేయాలనుకుంటున్నారు. డిసెంబర్ జనవరి ఫిబ్రవరి మార్చి నెలల్లో చిత్రాన్ని పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. థ్రిల్లింగ్ కలిగించే థ్రిల్లర్ కథతో రూపొందుతున్న ఈ మూవీకి 'మైనా కుంకీ గీతు చిలసౌ రిపబ్లిక్ వంటి చిత్రాలకు సినిమాటోగ్రఫీని అందించిన సుకుమారన్ ఈ చిత్రానికి వర్క్ చేస్తున్నారు. ఇందులో సమంతతో పాటు నటించే నటీనటుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు. మణిశర్మ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి మాటలు పులగం చిన్నారాయణ డా. చల్లా భాగ్యలక్ష్మి.. పాటలు రామజోగయ్య శాస్త్రి.

# రషెస్ చూశాను చాలా గర్వంగా వుంది : మహేష్




స్టార్ హీరో యంగ్ టైగర్ ఎన్టీఆర్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న రియాలిటీ షో 'ఎవరు మీలో కోటీశ్వరులు'. గత కొన్ని వారాలుగా ఓ ప్రముఖ ఎంటర్టైన్మెంట్ ఛానల్లో విజయవంతంగా ప్రదర్శింపబడుతున్న ఈ షో తొలి సీజన్ ఈ ఆదివారంలో ముగిసింది. ఈ ఆఖరి ఎపిసోడ్ లో సూపర్ స్టార్ మహేష్ బాబు పాల్గొని సందడి చేశారు. ఇద్దరు సూపర్ స్టార్ లు ఎదురెదురు సీట్లలో కూర్చుని కనిపించడం ఫ్యాన్స్కి ఓ పండగలా కనిపించింది. బుల్లితెరపై ఇలా ఈ ఇద్దరు స్టార్ లు కలిసి ఒకే వేదికపై పాలు పంచుకోవడం.. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అడిగిన ఫన్నీ ప్రశ్నలకు అంతే సమయస్ఫూర్తితో మహేష్ ఫన్నీగా సామాధానాలు చెప్పడం వీక్షకుల్ని ఆనందానుభూతికి లోను చేసింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అడిగిన ప్రశ్నలకు టక టకా సమాధానం చెప్పిన మహేష్ 25 లక్షలు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ పలు ఆసక్తికర విషయాల్ని ఎన్టీఆర్ తో పంచుకున్నారు. ప్రస్తుతం హీరోగా 'సర్కారు వారి పాట' చిత్రంతో బిజీగా వున్నారు మహేష్ ఆ మూవీ విశేషాలతో పాటు తాను వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్గా వ్యవహరిస్తున్న 'మేజర్' చిత్రానికి సంబంధించిన పలు ఆసక్తికర అంశాలని వెల్లడించారు. పరశురామ్ డైరెక్షన్ లో చేస్తున్న 'సర్కారు వారి పాట' 'పోకిరి' చిత్రాన్ని గుర్తు చేస్తుందని చెప్పారు. ఇందులో తన పాత్ర చాలా ఎనర్జిటిక్ గా వుంటుందని అంతే కాకుండా చాలా ఎంటర్టైనింగ్ గా వుంటుందని తెలిపారు మహేష్. ఇదే సందర్భంగా మేజర్ ఉన్నికృష్ణన్ కథ ఆధారంగా చేస్తున్న 'మేజర్' గురించి చెప్పమని ఎన్టీఆర్ అడిగినప్పుడు 'శేష అద్భుతంగా నటించాడు. హ్యాట్సాఫ్ టు హిమ్. ఆ సినిమాలో నేను చాలా తక్కువగా ఇన్వాల్వ్ అయ్యాను. ఒకటి .. రెండు రోజులు మాత్రమే డిస్కర్షన్స్ లో పాల్గొన్నాను. రషెస్ చూసిన తరువాత చాలా గర్వంగా వుంది. ఈ సినిమా రిలీజ్ కోసం ఎదురుచూస్తున్నాను' అని మహేష్ వెల్లడించారు. నిర్మాతగా వ్యవహరించిన మహేష్ 'మేజర్' విడుదల కోసం ఎదురుచూస్తున్నారంటే అడివి శేష్ ఏ రేంజ్ లో నటించారో అర్థం చేసుకోవచ్చు అని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న 'మేజర్' చిత్రం ఫిబ్రవరి 11న విడుదల కానుంది.

# రాజమౌళి కోరిక తీర్చిన బాలకృష్ణ



ఒకరి జీవితం మరొకరి జీవితాన్ని ఖచ్చితంగా ప్రభావితం చేస్తుందన్నది మనందరికి తెలిసిందే. అలాగే ఒకరి సక్సెస్ మరొకరి సినిమాకు బంగారు బాటలు వేస్తుందన్నది నేటి సినీ జనం బలంగా నమ్ముతున్న మాట. ఆ మాటే ఈ రోజు అక్షరాలా నిజమై త్వరలో విడుదలకు సిద్ధంగా వున్న సినిమాలకు నూతన జవసత్వాలతో పాటు ఆ చిత్ర దర్శకనిర్మాతలకు ఊపిరులూదింది. కరోనా భయాలతో భారీ చిత్రాల కోసం ప్రేక్షకులు థియేటర్లకు వస్తారా? అని ఇండస్ట్రీ వర్గాలు భయంతో వణికిపోతున్న వేళ ఇది. మరో పక్క ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం టిక్కెట్ ధరల్ని ఇష్టాను సారంగా పెంచుకోవడానికి వీల్లేదంటూ హుకుం జారీ చేసిన నేపథ్యంలో నందమూరి నటసింహం బాలకృష్ణ నటించిన 'అఖండ' పేరుకు తగ్గట్టే అఖండమైన విజయాన్ని సాధించి కలెక్షన్ల సునామిని సృష్టిస్తోంది. బోయపాటి శ్రీను - బాలయ్యల కలయికలో వచ్చిన సింహా.. లెజెండ్ చిత్రాలకు మించి బాక్సాఫీస్ వద్ద ఓ రేంజ్లో వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో బోయపాటిశ్రీను గారు ఈ ఆడిటోరియానికే కాకుండా మొత్తం సినిమా ఇండస్ట్రీకే ఓ ఊపు తెప్పించినందుకు థ్యాంక్యూ..డిసెంబర్ 2 నుంచి మొదలుపెట్టి అన్ని థియేటర్లు కంటిన్యూస్గా ఫుల్గా ఇదే స్థాయి అరుపులు కేకలతో ఇక్కడున్న మాకు ఎంత ఆనందాన్ని కలిగించిందో రెండు తెలుగు రాష్ట్రాల్లో వున్న తెలుగు వాళ్లకి అంతే ఆనందాన్ని కలిగించాలని ఖచ్చితంగా చెబుతున్నాను. బాలయ్య బాబు ఒక ఆటంబాంబు.. అఖండ చాలా చాలా పెద్ద హిట్ అవ్వాలి.. మళ్లీ మా ఇండస్ట్రీ ఒక కొత్త ఊపుని తీసుకురావాలి..' అని కోరుకున్నారు. రాజమౌళి కోరుకున్నట్టే డిసంబర్ 2న విడుదలైన 'అఖండ' అఖండమైన విజయాన్ని సాధించింది. అంతే కాకుండా ఈ సినిమా భారీ వసూళ్లని రాబట్టి ఇప్పుడు తమ చిత్రాలని విడుదల చేయాలా అని మీమాంసలోవున్న ఇండస్ట్రీ వర్గాల్లో భరోసాని పెంచింది. 'అఖండ' ఇచ్చిన ఊపుతో త్వరలో రిలీజ్కు సిద్ధంగా వున్న చిత్ర వర్గాల్లో సరికొత్త ఊపు కనిపిస్తోంది. పోటీ పోటీగా ప్రచారం మొదలుపెట్టారు. ఈ నెల 17న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'పుష్ప' 24న నేచురల్ స్టార్ నాని నటించిన 'శ్యామ్ సింఘ్ రాయ్ విడుదలకు సిద్ధమవుతున్నాయి. ఈ రెండు చిత్రాలూ పాన్ ఇండియా స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్నవే. ఆ తరువాత జనవరిలో సంక్రాంతికి రాజమౌళి 'ఆర్ ఆర్ ఆర్'.. ప్రభాస్ 'రాధేశ్యామ్ వరల్డ్ వైడ్గా థియేటర్లలో సందడి చేయబోతున్నాయి. ఇప్పటికే వీటి ప్రచారాన్ని మేకర్స్ ప్రారంభించేశారు. మొత్తానికి 'అఖండ' మైన ఊపు వల్లే మిగతా చిత్రాల నిర్మాతలు.. దర్శకులు హీరోలు ఊపిరి పీల్చుకున్నారు. అందులోనూ మరీ ముఖ్యంగా దర్శకధీరుడు రాజమౌళి 'అఖండ' సినిమా బ్లాక్ బస్టర్ కావాలని బలంగా కోరుకున్నారు. ఆయన కోరిక నెరవేరడంతో రాజమౌళి కూడా సూపర్ స్పీడుతో తన 'ఆర్ ఆర్ ఆర్' ప్రాచారాన్ని మరింత స్పీడు పెంచబోతున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

# మ్యాచ్ ఆడలేదు.. హీరో అయ్యాడు; అవార్డు గెలిచాడు



బ్లాక్‌క్యాప్స్ అంటే నాణ్యమైన ఫీల్డింగ్‌కు పెట్టింది పేరు. టి20, పరిమిత ఓవర్లలో వారి ఫీల్డింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అలాంటిది టెస్టుల్లో కూడా తమదైన ఫీల్డింగ్‌తో అదరగొట్టారు కివీస్ ఆటగాళ్లు. అందుకు మిచెల్ సాంట్నర్ ఒక నిదర్శనం. అసలే టెస్టు మ్యాచ్‌ల్లో సిక్సర్లు కొట్టడం అరుదు. అలాంటిది అయ్యర్ కొట్టిన భారీషాట్‌ను సాంట్నర్ తన అద్భుత ఫీల్డింగ్‌తో ఆపిన విధానం సూపర్ అని చెప్పొచ్చు. భారత్‌తో ముగిసిన రెండో టెస్టులో ఇది చోటుచేసుకుంది. ఇక టీమిండియా-కివీస్ టెస్టు సిరీస్‌లో మిచెల్ సాంట్నర్ ఒక్క మ్యాచ్‌లోనూ ఆడలేదు. కేవలం సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా మాత్రమే జట్టుకు సేవలందించిన సాంట్నర్ అవార్డు గెలుచుకున్నాడు. తన ఫీల్డింగ్‌తో సిక్స్ రాకుండా అడ్డుకున్న సాంట్నర్‌ను "బెస్ట్ సేవ్ ఆఫ్ ది మ్యాచ్" కింద రూ.లక్ష ప్రైజ్‌మనీ ఇవ్వడం విశేషం. టీమిండియా మొదటి ఇన్నింగ్స్‌లో భాగంగా ఇన్నింగ్స్ 47వ ఓవర్‌లో సోమర్ విల్లే బౌలింగ్‌లో శ్రేయాస్ అయ్యర్ లెగ్‌సైడ్ దిశగా భారీ షాట్ ఆడాడు. కచ్చితంగా సిక్స్ అనుకుంటున్న తరుణంలో సాంట్నర్ మ్యాజిక్ చేశాడు. బౌండరీలైన్ వద్ద అమాంతం గాల్లోకి ఎగిరి బంతిని అందుకున్న అతను బ్యాలెన్స్ చేసుకోవడం కష్టం కావడంతో బంతిని బౌండరీ ఇవతలకు వేయడంతో సిక్స్ రాకుండా అడ్డుకున్నాడు. అలా జట్టుకు ఐదు పరుగులు కాపాడిన సాంట్నర్‌ను సహచర ఆటగాళ్లు అభినందించారు. ఇక రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 1-0 తేడాతో కైవసం చేసుకుంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190